# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 43 | ఎడిటర్: మేనం శ్యామ్ | ఆదివారం 30-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

రచ్చబండపై నిలదీయాలి!
రోడ్డుపై కనిపించే ప్రతి గోతీ
కేవలం మట్టి లోపం కాదు..
పాలనలోని లోపాలకు అద్దం.
గోతుల్లో పడి ప్రజలు గాయపడుతుంటే,
ప్రాణాలు పోతుంటే
అధికారుల మౌనం దేనికి సంకేతం?
ప్రజల సమక్షంలోనే పాలకులు,
అధికారులను బాధ్యతపై నిలదీయాలి.
రైతన్న కన్నీటికి కూడా పాలకులు లెక్క చెప్పాలి.
పొలాల్లో నీరు లేక పైర్లు ఎండిపోతుంటే
రైతు బాధను పట్టించుకోవాలి.
రుణమాఫీ, రైతు సాయం అందక రైతులు
ఇబ్బందులు పడుతుంటే సమాధానం చెప్పాలి.
ఎండిన పైర్లను పాలకుల గడపకు తీసుకెళ్లి
నిరసన తెలపాలి.ఎన్నికల ముందు ఇచ్చిన
హామీలను ప్రజల ముందుంచి
ఒక్కొక్కటిగా ప్రశ్నించాలి. అమలైన హామీలెన్ని?
మిగిలినవెన్ని? స్పష్టమైన లెక్క ఇవ్వాలి.
హామీల కాగితాలనే ప్రభుత్వాన్ని నిలదీసే
పత్రాలుగా మార్చాలి.
ప్రజల కష్టాల కంటే సభా నియమాలు,
అధికార ముచ్చట్లు గొప్పవి కావు.
శాసనసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి..
అవసరమైతే సభను స్తంభింపజేయాలి.
వీధుల్లోకి వచ్చి ప్రజా సమస్యలపై చైతన్యం
కలిగించాలి.ప్రజల గొంతుకగా నిలవడం
ప్రతిపక్షాల ప్రధాన బాధ్యత.
కరుణ లేని పాలనపై విమర్శలతో
సరిపెట్టుకోకూడదు.
ప్రతి వైఫల్యంపై
సమాధానం వచ్చే వరకు పోరాడాలి.
ప్రతి హామీకి లెక్క..
ప్రతి సమస్యకు పరిష్కారం కోరాలి.ప్రజల
ప్రశ్నలను పాలకుల చెవులకు చేరేలా
ఉద్యమించాలి.నిరసనలు ఇక సాధారణ
కార్యక్రమాలు కాకుండా ప్రజా ధిక్కార స్వరాలుగా
మారాలి.ప్రజల పక్షాన ప్రతిపక్ష స్వరం..
ధిక్కార శంఖారావంలా మారాలి!

– వారే వేణుగోపాల్ ..,
పాపన్న పేట.మెదక్ జిల్లా.

# అసెంబ్లీకి ముహూర్తం

- పార్టీల వ్యూహ రచన
- సెప్టెంబర్ 7న అసెంబ్లీ సమరం
- కేసీఆర్ వస్తారా?
- కాంగ్రెస్ వ్యూహమేంటి?
- ప్రతిపక్షాల అస్త్రాలేంటి?



**ప్రజావాయిస్, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు సెప్టెంబర్ 7న తెరలేవనుండటంతో రాష్ట్ర రాజకీయాల్లో అప్పుడే వేడి రాజుకుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న సమావేశాలు ఈసారి సాధారణ సభా కార్యక్రమాలకే పరిమితం కాకుండా అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సమరానికి వేదికగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరవుతారా? అన్న ప్రశ్న ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

**కేసీఆర్ రాకపై ఉత్కంఠ:**

అధికారం కోల్పోయిన తర్వాత అసెంబ్లీ కార్యకలాపాలకు కేసీఆర్ దూరంగా ఉంటున్న నేపథ్యంలో ఈ సమావేశాలకు ఆయన హాజరవుతారా లేదా అన్నదానిపై ఆసక్తి నెలకొంది. కేసీఆర్ సభకు వస్తే ప్రభుత్వంపై ఆయన చేసే విమర్శలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రాజకీయంగా ఎదురుపడే అవకాశం ప్రధాన ఆకర్షణగా మారనుంది. ఒకవేళ ఆయన సభకు దూరంగా ఉంటే కాంగ్రెస్ అదే అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకునే అవకాశముంది.

**కాంగ్రెస్ ఎదురుదాడికి సిద్ధం:**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రైతు సంక్షేమం, భూ సమస్యల పరిష్కారం, ఉద్యోగాలు తదితర అంశాలను సభ వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. అదే సమయంలో గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన నిర్ణయాలు, ఆర్థిక వ్యవహారాలు, ప్రాజెక్టుల అంశాలను తెరపైకి తీసుకొచ్చి ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టే వ్యూహాన్ని అనుసరించే అవకాశం ఉంది.

**బీఆర్ఎస్ అస్త్రాలేంటి?:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, రైతు సమస్యలు, నిరుద్యోగం, ప్రజా సంక్షేమం, సాగునీరు తదితర అంశాలపై బీఆర్ఎస్ గట్టిగా నిలదీయడానికి సిద్ధమవుతోంది. అసెంబ్లీ సమావేశాలకు ముందే ప్రజా సమస్యలను ఎజెండాగా చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా పార్టీ కార్యాచరణ రూపొందిస్తోంది. కేటీఆర్, హరీశ్‌రావు తదితర నేతలు సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశముంది.

**బీజేపీది దారేటు..**

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరును తనకు అనుకూలంగా మలుచుకునేందుకు బీజేపీ కూడా సిద్ధమవుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంతో పాటు బీఆర్ఎస్ పాలనపై కూడా విమర్శలు చేస్తూ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలిచే ప్రయత్నం చేయనుంది. ప్రజా సమస్యలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో తన బలాన్ని చాటుకునేందుకు అసెంబ్లీ వేదికను ఉపయోగించుకోవాలని ఆ పార్టీ భావిస్తోంది.సభలో కీలక అంశాలపై పోరు: రైతులు, సాగునీరు, భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి పనులు తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం కీలక

మిగతా 2లో

## కుడి కాలువకు నీళ్లు ఎలా ఇస్తారు.. ఎడమ కాలువకు ఎందుకు ఇవ్వరు?


- రేవంత్ సర్కార్ తీరుపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్
- ఏపీకి నీటి విడుదలపై తెలంగాణ ప్రభుత్వాన్ని నిలదీత
- తెలంగాణ రైతాంగం తిరగబడితే మంత్రుల లాగులు పగులుతాయని హెచ్చరిక
- నల్గొండ మంత్రులకు తెలంగాణ ఆత్మ గౌరవం లేదా? అంటూ ఘాటు వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ పోరాటానికి భయపడే ఎడమ కాలువకు కొద్దిగా నీళ్లు వదులుతున్నారని విమర్శ

2లో



## హిమాలయాల్లో జలప్రళయం.. నేపాల్ విలవిల

- 669కు చేరిన మృతుల సంఖ్య
- 3 వేల మందికి పైగా గల్లంతు
- 3,700 మందికి రక్షణ
- వరద బీభత్సంతో రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసం
- సహాయక చర్యలకు ఆటంకంగా వర్షాలు
- కొనసాగుతున్న గాలింపు



**ప్రజా వాయిస్ డెస్క్.** హిమాలయాల్లో ప్రకృతి ప్రకోపం నేపాల్‌ను అతలాకుతలం చేసింది. నేపాల్–చైనా సరిహద్దు ప్రాంతంలో సంభవించిన భారీ వరదలు, కొండచరియలు, మంచు విరిగిపాతాలతో పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. భోటే కోషి నదీ పరివాహక ప్రాంతంలో ఒక్కసారిగా వరద పోటెత్తడంతో ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. అనేక ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.వరదల ధాటికి ఇప్పటివరకు 669 మంది మృతి చెందగా.. దాదాపు 3 వేల మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు 3,700 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గల్లంతైన వారి కోసం నేపాల్ సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు ముమ్మరంగా గాలింపు చేపడుతున్నాయి. మారుమూల పర్వత ప్రాంతాలకు చేరుకోవడం రక్షణ బృందాలకు సవాలుగా మారింది.

**క్షణాల్లో కొట్టుకుపోయిన జీవనం**

భారీగా వచ్చిన నీరు, బురద, రాళ్లు నదీ పరివాహక ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించాయి. అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి. కీలకమైన రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో సహాయక బృందాలు బాధిత ప్రాంతాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నేపాల్–చైనా మధ్య వాణిజ్య రాకపోకలకు కీలకమైన మార్గాలు సైతం తీవ్రంగా దెబ్బతిన్నాయి.

**జలవిద్యుత్ ప్రాజెక్టులకు భారీ నష్టం**

వరదల ప్రభావంతో పలు

మిగతా 2లో

## సురేఖకు ఢోకా లేదు!

- పరకాల టికెట్‌పై సీఎం మాటే ఫైనల్ కాదు
- బీసీలకు మంత్రి పదవుల్లో అన్యాయం
- రాహుల్ దృష్టికి తీసుకెళ్తా
- సురేఖను ఎందుకు తొలగిస్తాం?
- ఆరు గ్యారంటీలు వంద శాతం అమలు కావడం లేదు
- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్

2లో



## చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం

- చిన్న నీటిపారుదల వ్యవస్థ పునర్వ్యవస్థీకరణకు రైతు కమిషన్ సిఫారసులు
- సాంకేతిక యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదన
- చెరువుల ఎఫ్‌టీఎల్ సరిహద్దుల గుర్తింపు
- ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక చర్యలు
- పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలని సీఎం సూచన.
- చెరువుల పునరుద్ధరణతో నీటి భద్రతకు భరోసా
- సీఎం రేవంత్ కు నివేదిక సమర్పించిన ఎం.కోదండరెడ్డి బృందం.
- కమిషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం. రేవంత్ రెడ్డి.

2లో



## తాష్కెంట్ టు బిష్కెక్.. మోదీ మిషన్



- మధ్య ఆసియాతో వ్యూహాత్మక బంధాల బలోపేతమే లక్ష్యం
- ఉజ్బెకిస్తాన్‌తో వాణిజ్యం, రక్షణ, ఇంధన రంగాలపై చర్చలు
- శాస్త్రి మెమోరియల్, గాంధీ కేంద్రాన్ని సందర్శించనున్న ప్రధాని
- 31న బిష్కెక్‌లో 26వ SCO శిఖరాగ్ర సదస్సుకు హాజరు కానున్న ప్రధాని నరేంద్ర మోదీ
- భద్రత, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలపై భారత్ దృష్టి

2లో

## గీత దాటితే వేటు తప్పదు!

- కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గాలి
- ప్రభుత్వంలో మార్పులు రావాలి
- క్యాడర్ అసంతృప్తిని బ్యాలెన్స్ చేయాలి
- అప్పుడే మళ్లీ అధికారం: గుత్తా సుఖేందర్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 29 (ప్రజా వాయిస్):** కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ అత్యంత కీలకమని, గీత దాటి వ్యవహరించే వారిపై సకాలంలో చర్యలు తీసుకోకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో నెలకొన్న గ్రూపు తగాదాలను తగ్గించడంతో పాటు క్యాడర్‌లో ఉన్న అసంతృప్తిని సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ప్రభుత్వంలో మార్పులు అవసరం**

క్యాబినెట్‌తో పాటు ప్రభుత్వంలోనూ అవసరమైన మార్పులు రావాల్సిన అవసరం ఉందని గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగితేనే ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని అన్నారు. గీత దాటే నేతలు, కార్యకర్తల విషయంలో అధిష్ఠానం కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

**సంక్షేమ పథకాలు కొనసాగాలి**

పేదలు, రైతులకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలని గుత్తా సూచించారు. వృద్ధులు, వితంతువులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు అందుతున్న పెన్షన్‌ను రూ.4 వేలకే పెంచాలని అభిప్రాయపడ్డారు. రైతులకు ఉపయోగకరంగా ఉన్న రైతు భరోసా పథకాన్ని

మిగతా 2లో

# సురేఖకు ఢోకా లేదు!



**హైదరాబాద్,ప్రజావాయిస్**..తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారిన కొండా సురేఖ వ్యవహారం, పరకాల అసెంబ్లీ టికెట్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి కొండా సురేఖ పదవికి ఎలాంటి ఢోకా లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ మంత్రివర్గంలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం దక్కలేదని, ఈ విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లానని వెల్లడించారు. బీసీలకు సరైన వాటా దక్కలేదని తానే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినప్పుడు సురేఖను మంత్రి పదవి నుంచి ఎందుకు తొలగిస్తామని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు.

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి పరకాల సభలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికే మరోసారి టికెట్ ఖాయమని చెప్పడం, ఆ తర్వాత మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత 2028లో తానే పరకాల ఎమ్మెల్యే అభ్యర్థినంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టు కాంగ్రెస్‌లో రాజకీయ దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ అంశంపై పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సురేఖ వ్యవహారం మరింత చర్చనీయాంశమైంది. అయితే పరకాల టికెట్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాటే తుది నిర్ణయం కాదని, అభ్యర్థిని పార్టీ అధిష్ఠానమే ఖరారు చేస్తుందని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు.

సురేఖ వ్యవహారంపై గతంలో క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపినట్లు మహేశ్ గౌడ్ వెల్లడించారు. కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటినవేనని అప్పట్లో ఆయన స్పష్టం చేశారు. అయితే తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో సురేఖ మంత్రి పదవికి ఢోకా లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కొత్త చర్చకు తెరతీశాయి. సురేఖపై చర్యలు తీసుకోవాలంటూ వచ్చిన డిమాండ్ల మధ్య పీసీసీ చీఫ్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.


మరోవైపు రాష్ట్ర మంత్రివర్గంలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యాన్ని ఇతర పార్టీలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు వంద శాతం అమలు కాలేదని ఆయన అంగీకరించడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం తెచ్చాయి.

కాంగ్రెస్‌లో అంతర్గతంగా విభేదాలు, వర్గపోరు ఉన్నప్పటికీ పార్టీకి నష్టం కలిగించే స్థాయిలో క్రమశిక్షణ ఉల్లంఘనను సహించబోమని మహేశ్ గౌడ్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే పరకాల టికెట్ విషయంలో అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుందని తాజాగా చెప్పడం ద్వారా స్థానిక హామీలు, అధిష్ఠానం నిర్ణయం మధ్య తేడా ఉంటుందనే సంకేతం ఇచ్చారు. దీంతో పరకాల కాంగ్రెస్ టికెట్ అంశం కూడా రాబోయే రోజుల్లో మరింత వేడెక్కే అవకాశం కనిపిస్తోంది.

మొత్తంగా ఈరోజు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు చూస్తే కొండా సురేఖకు మంత్రి పదవిపై భరోసా కల్పించడం, పరకాల టికెట్‌పై అధిష్ఠానం పెత్తనాన్ని స్పష్టం చేయడం, బీసీ ప్రాతినిధ్యంపై అధిష్ఠానంతో తన చర్చలను వెల్లడించడం, ఆరు గ్యారంటీల అమలుపై వాస్తవ పరిస్థితిని అంగీకరించడం వంటి అంశాలు తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ చర్చకు దారితీశాయి. సురేఖ ఎపిసోడ్‌కు తాత్కాలికంగా తెరపడినట్టే కనిపిస్తున్నా.. పరకాల టికెట్ వ్యవహారం మాత్రం కాంగ్రెస్‌లో కొత్త మంటలు రాజేసే అవకాశముంది.

# ఆదరణ పొందుతున్న బీఆర్ఎస్!

- ప్రజల సమస్యలను ఎత్తుచూపుతున్న మాజీలు?
- అధికార పార్టీకి గట్టి కాలమేనని సీనియర్ నాయకులు!
- రోజు రోజుకి ప్రజల వద్దకు చేరువ అవుతున్న నాయకత్వం!
- తలనొప్పిగా మారుతున్న నియోజకవర్గ రాజకీయం
- ఆదరణ లేక ఒంటరిగానే కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికార పార్టీ!




**ప్రజా వాయిస్ డెస్క్, హైదరాబాద్**.ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో అధికార పార్టీ పై ప్రజలకు రోజు రోజు నమ్మకం పోవడంతో బీఆర్ఎస్ పార్టీ ఆదరణ పొందుతుందని చెప్పుకోవచ్చు. ప్రజల సమస్యలను మాజీలు ఎత్తు చూపటమే కాకుండా ప్రభుత్వాన్ని పనులు చేయించే విధంగా ఒత్తిడి తేవడంలో కీలక పాత్ర వహించడంతో అధికార పార్టీ నాయకుల గుండెల్లో కొంత అలజడ మొదలైంది అని చెప్పుకోవచ్చు. నియోజకవర్గంలోని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలు తోనే అధికార పార్టీ కాలం గడుపుతున్నది తప్ప ప్రజలకు రవంతైన మేలు చేసే పథకాలు ఏవి కూడా అమలు చేయకుండా కాలం గడిపేస్తుందని అంతేకాకుండా వర్గ పోరు అయినప్పటికీ ప్రజల సమస్యల కోసం కొట్లాడేందుకు ముందుగా చీమలదండులా కదిలి దండయాత్ర ప్రకటించే విధంగా పనిచేయటం అధికార పార్టీ నాయకులకు మింగిడిపడి పరిస్థితి లేకుండా పోతుందని కొందరు సీనియర్ నాయకులు సైతం చర్చించుకోవడం నియోజకవర్గం లోనే సంచలన సృష్టిస్తుంది. రాష్టములో అధికార పార్టీ వెయ్యి రోజులు పదవులు చేపట్టి గడుస్తున్న నేటికీ బిఆర్ఎస్ పార్టీకి ఉనికి కోల్పోలేదని కొన్ని గ్రామాలలో జెండా స్థూపాలు సైతం ఏర్పాటు చేయటం ఓ సంచలనంగా మారింది అంతేకాకుండా అనేక సంక్షేమ పథకాలు తమ హయాంలోనే ప్రవేశపెట్టామని వాటిని చూస్తూ పబ్బం గడుపుకుంటున్నారని పలికినప్పటికీ స్పందన లేకుండా కేవలం అరాకొరి పనులతోనే కాలం గడిపేస్తున్నారని ఇటువంటి విధానానికి రాబోయే 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కచ్చితంగా కొనుక్కుని కాపాడుకొని అధికార పగ్గాలు చేపడుతుందని ఓటర్ల సైతం ఆశిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం ఏది ఏమైనా నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ క్రేజీ తగ్గకుండా ఓటర్లు తమ పార్టీకి ఎన్నిముఖంగా ఉంటారని పార్టీని ఏకధాటిగా నడుపుతామని మాజీలు చెబుతున్న అధికార పార్టీ నాయకులు మాత్రం సఖితలేని పార్టీ అంటూ హేతువుల పల్లకినప్పటికీ సంక్షేమ పథకాలలో ఏది ముందుండి ప్రజలకు అవకాశం ఇచ్చిందో చూసి తెలుసుకోవాలని మాజీల సైతం మండిపడటం గమనర్హం ఏది ఏమైనా రాబోయే కాలంలో పగ్గాలు చేతపడుతుందా మళ్లీ ఓటమి ఫాల్ అవుతుందో వేచి చూడాలి మరి!

# గీత దాటితే వేటు తప్పదు!

**మొదటి పేజీ తరువాయి**

కొనసాగించాలని కోరారు.

**22ఏ రద్దు చేయాలి**

భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు 22ఏ నిబంధనను రద్దు చేయాల్సిన అవసరం ఉందని గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అదే సమయంలో ప్రభుత్వంపై ఆర్థిక భారం పెంచే ఉచిత పథకాలను తగ్గించి, ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

**ఉద్యమకారులకు న్యాయం**

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు తగిన న్యాయం చేయాలని ఆయన అన్నారు. ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**మళ్లీ అధికారమే లక్ష్యం**

పార్టీలో అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలు తగ్గించి అందరినీ కలుపుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని గుత్తా స్పష్టం చేశారు. క్రమశిక్షణ, సంక్షేమం, క్యాడర్‌కు ప్రాధాన్యత, ప్రభుత్వ పనితీరులో మార్పులు వంటి అంశాలపై దృష్టి సారిస్తేనే కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశాలు మెరుగవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.



# అసెంబ్లీకి ముహూర్తం

బిల్లులు, తీర్మానాలను ముందుకు తెచ్చే అవకాశం ఉండగా.. ప్రతిపక్షాలు వాటిపై ప్రశ్నలు, అభ్యంతరాలతో ప్రభుత్వాన్ని నిలదీయనున్నాయి.

**ఎవరి వ్యూహం ఫలిస్తుంది?..**

సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే సమావేశాలు ప్రభుత్వ విధానాలకు పరీక్షగా, ప్రతిపక్షాల ఐక్యతకు సవాల్‌గా మారనున్నాయి. కేసీఆర్ సభకు వస్తారా? వస్తే ఏ అంశాలను లేవనెత్తుతారు? రాకపోతే బీఆర్ఎస్ వ్యూహం ఎలా ఉంటుంది? కాంగ్రెస్ ఎదురుదాడిని ఎలా తిప్పికొడుతుంది? బీజేపీ ఏ అంశాలను అస్త్రాలుగా మలుచుకుంటుంది? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొత్తంగా ఈ సమావేశాలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి పెంచడం ఖాయంగా కనిపిస్తోంది.

# హిమాలయాల్లో జలప్రళయం.. నేపాల్ విలవిల

**మొదటి పేజీ తరువాయి**

జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాజెక్టుల టన్నెళ్లలో కార్మికులు చిక్కుకున్నట్లు సమాచారం. వారిని రక్షించేందుకు ప్రత్యేక పరికరాలతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. విద్యుత్ మౌలిక వసతులకు జరిగిన నష్టం నేపాల్‌కు మరో పెద్ద సవాలుగా మారింది.

**మళ్లీ వరద ముప్పు**

ఇప్పటికే వరదలతో అతలాకుతలమైన ప్రాంతాలను మరోసారి భారీ వర్షాల ముప్పు వెంటాడుతోంది. కొండ ప్రాంతాల్లో కొత్తగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ఏర్పడిన సహజ నీటి నిల్వలు పొంగిపొర్లే ప్రమాదం ఉండటంతో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

**భారతీయుల కోసం ప్రత్యేక గాలింపు**

వరదల్లో పలువురు భారతీయులు కూడా చిక్కుకున్నారు. భారత ప్రభుత్వం నేపాల్ అధికారులతో సమన్వయం చేస్తూ వారి ఆచూకీ కోసం చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు 88 మంది భారతీయులను సురక్షితంగా తరలించగా.. 287 మంది ఆచూకీ తెలియాల్సి ఉందని సమాచారం. మృతదేహాల గుర్తింపు, గాలింపు చర్యల్లో సహకరించేందుకు భారత బృందాలు కూడా రంగంలోకి దిగాయి.

**భారత్, చైనా సహకారం**

విపత్తు తీవ్రత దృష్ట్యా నేపాల్‌కు భారత్, చైనా సహా పలు దేశాలు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. సాంకేతిక నిపుణులు, ప్రత్యేక పరికరాలు, సహాయక సామగ్రి అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా టన్నెళ్లలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం, ధ్వంసమైన రహదారులు, వంతెనలను పునరుద్ధరించడం అత్యవసరంగా మారింది.

**రూ. వేల కోట్ల నష్టం**

వరదల కారణంగా మౌలిక వసతులకు భారీ నష్టం వాటిల్లింది. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, వాణిజ్య మార్గాలు ధ్వంసమయ్యాయి. పునర్నిర్మాణానికి భారీగా నిధులు అవసరమయ్యే పరిస్థితి ఏర్పడింది. వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. పాఠశాలలు కూడా దెబ్బతినడంతో పిల్లల విద్యకు అంతరాయం ఏర్పడింది.హిమాలయ ప్రాంతంలో పెరుగుతున్న వాతావరణ మార్పులు, మంచు కరగడం, కొండచరియలు విరిగిపడటం వంటి పరిణామాలు ఇటువంటి ఆకస్మిక వరదల ముప్పును మరింత పెంచుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు, బాధితుల తరలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో నేపాల్ ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు.

# కుడి కాలువకు నీళ్లు ఎలా ఇస్తారు.. ఎడమ కాలువకు ఎందుకు ఇవ్వరు?

**ప్రజావాయిస్, నల్గొండ**. నాగార్జునసాగర్ కుడి కాలువను ఏపీ ప్రభుత్వం దౌర్జన్యంగా తెరిచి నీటిని తరలిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం నీటిని తీసుకెళ్లడం పూర్తిగా సీఎం రేవంత్‌రెడ్డి అంగీకారంతోనే జరుగుతోందని ఆయన విమర్శించారు. ఏపీకి కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్నప్పుడు తెలంగాణకు చెందిన ఎడమ కాలువకు ఎందుకు నీటిని విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ప్రాజెక్టుకు నీటిని తీసుకునే అవకాశం ఎందుకు కల్పించడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల మంత్రులను ఆయన నిలదీశారు. ఏపీ మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి చంద్రబాబును కలసి కుడి కాలువకు నీటి కోసం పోరాడారని, తెలంగాణ మంత్రులు మాత్రం రైతుల సమస్యలపై స్పందించడం లేదని మండిపడ్డారు. నల్గొండ జిల్లాలోని ఇద్దరు మంత్రులు ఎడమ కాలువ కింద ఉన్న రైతుల అండతోనే బతుకుతున్నారని, అయినా తెలంగాణ ఆత్మగౌరవంతో వ్యవహరించడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందనే భయంతో ఎడమ కాలువ గేట్లను కొద్దిగా ఎత్తి నామమాత్రంగా నీటిని విడుదల చేస్తున్నారని ఆరోపించారు. కుడి కాలువకు నీళ్లు ఎలా ఇస్తారు.. ఎడమ కాలువకు ఎందుకు ఇవ్వరు? అని ప్రశ్నించిన జగదీష్‌రెడ్డి, తెలంగాణ రైతాంగం, ముఖ్యంగా నల్గొండ రైతాంగం తిరగబడితే మంత్రులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



# తాష్కెంట్ టు బిష్కెక్.. మోదీ మిషన్

ప్రజా వాయిస్, న్యూఢిల్లీ, ఆగస్టు 29: ప్రధాని నరేంద్ర మోదీ నాలుగు రోజుల మధ్య ఆసియా పర్యటనలో భాగంగా శనివారం ఉజ్బెకిస్తాన్ చేరుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు రెండు రోజుల అధికారిక పర్యటన చేపట్టిన మోదీ.. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య తదితర రంగాల్లో సహకార విస్తరణపై ఇరు దేశాల నేతలు సమీక్షించనున్నారు. తాష్కెంట్‌లో లాల్ బహదూర్ శాస్త్రి మెమోరియల్, మహాత్మా గాంధీ సెంటర్‌ను మోదీ సందర్శించనున్నారు. అనంతరం ఆగస్టు 31న కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో ప్రారంభమయ్యే 26వ షాంఘై సహకార సంస్థ (SCO) శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. సదస్సులో భారత్ భద్రత, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ.. ఉగ్రవాద నిర్మూలన, ప్రాంతీయ శాంతి, స్థిరత్వం కోసం సభ్యదేశాల మధ్య సమన్వయాన్ని మరింత పెంచాలని పిలుపునివ్వనుంది.

# చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం



హైదరాబాద్,ప్రజావాయిస్.రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి నివేదికను అందించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను అనుసంధానం చేయడంతో పాటు కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేసి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచాలని కమిషన్ ప్రతిపాదించింది. చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టాన్ని రూపొందించాలని, చెరువుల ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి ఆక్రమణలను తొలగించాలని సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత కీలకమని నివేదికలో పేర్కొంది. గత రెండేళ్లుగా కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కమిషన్ పనితీరుపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. పంటల మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడంతో పాటు ఉద్యానవన పంటల సాగును పెంచడం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవో) ఏర్పాటు వంటి అంశాలపై మరింత దృష్టి సారించాలని ముఖ్యమంత్రి కమిషన్‌కు సూచించారు. చిన్న నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా సాగునీటి లభ్యతను పెంచి రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

# 14 ఏళ్ల తర్వాత.. పోలీస్ సంఘానికి ఎన్నికల జోష్!

- హోరాహోరీగా సాగిన ఎన్నికలు
- పలువురు డైరెక్టర్లుగా విజయం
- 31న జిల్లా అధ్యక్షుడి ఎన్నిక
- విజేతలందరికీ ప్రజావాయిస్ శుభాకాంక్షలు





**ప్రజావాయిస్, నల్లగొండ**.14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నల్లగొండ జిల్లా పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం ఉత్కంఠగా జరిగాయి. పోలీసుల సమస్యలు, సంక్షేమం కోసం నిర్వహించిన ఎన్నికల్లో పలు డివిజన్లు, సర్కిళ్ల నుంచి అధికారులు, సిబ్బంది డైరెక్టర్లుగా విజయం సాధించారు. అధికారుల కేటగిరీలో మాడుగులపల్లి ఎస్సై పంగా సురేష్‌యాదవ్ నాలుగు ఓట్ల మెజారిటీతో గెలుపొందగా, నల్లగొండ డివిజన్‌లో తిప్పర్తి ఎస్సై ఇరుగు రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కానిస్టేబుల్ కేటగిరీలో రాయనబోయిన రాంబాబు, మహిళా కేటగిరీలో గడ్డం అరుణ విజయం సాధించారు.మిర్యాలగూడ టూటౌన్ నుంచి పసుపులేటి బాలకృష్ణ, రూరల్ నుంచి టి.భాస్కర్, ఆర్.రాంబాబు, నాగార్జునసాగర్ నుంచి నమ్మిడి జహీద్ పాషా, చండూరు నుంచి ఉడుత రమేష్, కావాలి నరసింహ, కొండమల్లేపల్లి నుంచి గుండమల్ల భాస్కర్, నాంపల్లి నుంచి బి.నగేష్, శాలిగౌరారం నుంచి సామా శ్రీను, బోయిల్లా లక్ష్మణ్, హాలియా నుంచి మన్నూరు సతీష్‌కుమార్ విజయం సాధించారు.ఇంకా కొన్ని ప్రాంతాల ఫలితాలు వెలువడాల్సి ఉండగా, వివరాలు అందిన వెంటనే వెల్లడించనున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన అధికారులు, సిబ్బంది, మహిళా ప్రతినిధులు, డైరెక్టర్లందరికీ ప్రజావాయిస్ హృదయపూర్వక శుభాకాంక్షలు. పోలీసుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నూతన ప్రతినిధులు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షిస్తున్నాం.

**31న జిల్లా అధ్యక్షుడి ఎన్నిక**

వివిధ ప్రాంతాల నుంచి ఎన్నికైన డైరెక్టర్లు ఈనెల 31న నల్లగొండలో జరిగే సమావేశంలో తమ ఓటు హక్కును వినియోగించి జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. దీంతో తదుపరి నాయకత్వంపై పోలీసు వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



## కాగజ్‌నగర్‌లో ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్ట్

- రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం

**ప్రజా వాయిస్ కగజ్ నగర్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.దాడానగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పల్లెపు రాము (21), పెయింటింగ్ పనివాడు శిలుముల అభిషేక్ (22)లను ఎస్టీ హాస్టల్, జనని హాస్పిటల్ ఎదురుగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. వారి మొబైల్ ఫోన్లను పరిశీలించగా ఆన్‌లైన్ మట్కాకు సంబంధించిన సమాచారం, కార్యకలాపాలు ఉన్నట్లు గుర్తించి, ఫోన్లను స్వాధీనం చేసుకుని కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనపై సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆన్‌లైన్ మట్కా, బెట్టింగ్ తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ టౌన్ పోలీసులు తెలిపారు.

## దుమ్ము ధూళితో ఊపిరాడని ప్రయాణం

- సర్దార్ నగర్ నుండి ఏలికట్ట చౌరస్తా అదానీ సమీపంలో ప్రధాన రహదారి మరింత దారుణం
- భారీ టిప్పర్లు లారీల రాకపోకలతో మరింత అధ్వానంగా మారిన రోడ్డు
- రోడ్డు ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది
- అధికారులు నిర్లక్ష్యంపై ప్రజల తీవ్ర ఆగ్రహం



**(ప్రజా వాయిస్ షాద్‌నగర్)**షాద్‌నగర్ నుండి చేవెళ్ల వెళ్లే ప్రధాన రహదారిపై సర్దార్ నగర్ పరిధిలోని అదానీ కంపెనీ సమీపంలో రహదారి పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది సర్దార్ నగర్ నుండి ఏలికట్ట వరకు ఉన్న రోడ్డు తీవ్రంగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు మరియు ద్విచక్ర వాహనదారులు నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు ఈ మార్గంలో పరిశ్రమలకు సంబంధించి నిత్యం భారీ టిప్పర్లు లారీలు అధిక వేగంతో ప్రయాణిస్తుండటంతో రహదారి పూర్తిగా ధ్వంసమైంది వాహనాలు వెళ్తున్న సమయంలో విపరీతమైన దుమ్ము ధూళి ఎగిసి పడి కంటిచూపు ఆనక బైకర్లు తీవ్ర ప్రమాదాల బారిన పడుతున్నారు గుంతలను తప్పించబోయి ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి కిందపడి పలువురు తీవ్రంగా గాయపడుతున్నారు ప్రధాన రహదారి ఇంత అధ్వానంగా తయారైనా సంబంధిత అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడం శోచనీయం ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతే బాధ్యత ఎవరు తీసుకుంటారు అని స్థానిక ప్రజలు వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి అదానీ పరిశ్రమ సమీపంలోని రహదారికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# గోపాల్ దీన్నేగ్రామ లో డెంగ్యూ పాజిటివ్ కేసు

- నివారణ చర్యలు ముమ్మరం మండల వైద్య అధికారి డాక్టర్ రాజశేఖర్
- కేసు నివాసంలో వైద్య సిబ్బంది పర్యటన
- 20 రక్త నమూనాల సేకరణ
- ఇంటింటా జ్వర సర్వే నిర్వహించాలన్న గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత



**ప్రజా వాయిస్.. వనపర్తి** వీపనగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సి ) పరిధిలోని గోపాల్ దీన్నె గ్రామంలో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టారు.గోపాల్ దీన్నె గ్రామానికి చెందిన ఎం. కురుమయ్య (52), తండ్రి కాసింకు డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో మండల వైద్యాధికారి డా. రాజశేఖర్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఏ ఎల్ ఓ , బృందం గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించింది.ఈ సందర్భంగా పీహెచ్ సి మండల వైద్యాధికారి డా. రాజశేఖర్ డెంగ్యూ కేసు నివాసాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు, స్థానిక ప్రజలకు డెంగ్యూ నివారణ, పరిసరాల పరిశుభ్రత, దోమల నియంత్రణ, జ్వర లక్షణాలపై అవగాహన కల్పించారు.అనంతరం ఏ ఎల్ ఓ , ఫీవర్ సర్వే నిర్వహించి అనుమానిత జ్వర కేసుల నుంచి 20 రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత మాట్లాడుతూ,, గ్రామంలో డెంగ్యూ పాజిటివ్ కేసు ఇంటితో పాటు పరిసర ప్రాంతంలోని ఇళ్లలో ఇండోర్ రెసిడ్యువల్ పైరెత్రమ్ స్ప్రేయింగ్ ( ఐఆర్ఎస్ ) చేపట్టారు.అలాగే ఇంటింటికీ జ్వర సర్వే నిర్వహించి, సమీపంలోని ఇళ్ల నుంచి రక్త నమూనాలను సేకరించి ఎలీసా పరీక్షల పంపించారు.అలాగే డెంగ్యూ నియంత్రణలో భాగంగా ప్రజలు ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టాలని వైద్య సిబ్బంది సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఆయుష్ డాక్టర్ శ్వేత, జహంగీర్, రవీందర్, రవికుమార్ (బ్రీడింగ్ చెక్కర్), ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసాలపై కదం తొక్కాలే

- 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి మ్రోగించాలే
- సెప్టెంబర్ 02 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపు

**ప్రజా వాయిస్ మంథని** అనేక హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలను చేసిన మోసాలపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కదం తొక్కాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. శనివారం మంథని పట్టణంలోని రాజగృహాలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి ప్రతి మండల కేంద్రంలో వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో 6 గ్యారెంటీలు , 420 హామీలిచ్చి గద్దెనెక్కి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆయన తెలిపారు.అధికారంలోని వచ్చి వేయి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆయన వివరించారు. ఓట్ల కోసం ప్రతి ఇంటికి గ్యారెంటీ కార్డులు ఇచ్చారని, ఆ బాకీ కార్డులతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారని, కాంగ్రెస్ 6 గ్యారెంటీలు, 420 హామీల మోసాలను ప్రతి నియోజకవర్గంలోని గల్లీ గల్లీలో ఎండగట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. వారం రోజుల పాటు ప్రతి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి బీఆర్ఎస్ సమరభేరిని మ్రోగించాలని ఆయన ఈసందర్భంగా పిలుపునిచ్చారు.





## ఖోఖో, టగ్ ఆఫ్ వార్‌లో హోరాహోరీ పోరు

- విజేతలకు బహుమతులు
- క్రీడా స్ఫూర్తితో ఆరోగ్యకర సమాజం

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** క్రీడా స్ఫూర్తిని చాటుతూ యువతలో ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో సుల్తానాబాద్ ఖేల్ ఇండియా సెంటర్‌లో శనివారం ఖోఖో, టగ్ ఆఫ్ వార్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు ఈ పోటీలను నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు ప్రదర్శించిన పోరాట పటిమ ప్రేక్షకులను ఆకట్టుకుంది. పోటీల అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి ఏ. సురేష్, సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత మాట్లాడుతూ యువత నిత్య జీవితంలో క్రీడలకు సముచిత స్థానం కల్పించాలని సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదల పెరుగుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో యువత క్రీడారంగంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమీరిశెట్టి తిరుపతి, మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, వర ప్రదీప్, అబ్బాయి గౌడ్, కందుకూరి కుమార్, కోచ్ గెల్లు మధుకర్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, సత్యం, అజ్జు, శివ, సంధ్యతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

## క్రైమ్‌పై పట్టు

- నల్లగొండ పోలీస్‌కు అగ్రపీఠం
- క్లస్టర్-3లో నల్లగొండకు అగ్రస్థానం
- 8 కీలక అంశాల్లో సమగ్ర పనితీరు
- రాష్ట్రస్థాయి సమీక్షలో ఉత్తమ ప్రతిభ
- ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు ప్రశంసాపత్రం
- డీజీపీ సీవీ ఆనంద్ అభినందనలు

ప్రజా వాయిస్,నల్లగొండ.క్రైమ్ పారామీటర్ల అమలు, పోలీస్ శాఖ పనితీరులో నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల పనితీరుపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సమీక్షలో 8 కీలక అంశాల్లో సమగ్ర పనితీరు ఆధారంగా నల్లగొండ జిల్లా క్లస్టర్–3లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కు డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, అంకితభావంతో సాధించిన ఫలితాలను డీజీపీ ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ సాధించిన విజయంపై ఎస్పీ శరత్ చంద్ర పవార్ హర్షం వ్యక్తం చేస్తూ, ఇందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## ప్రజా వాయిస్ కథనానికి అదిరిపోయే స్పందన

- కథనానికి స్పందించిన ప్రభుత్వం ఏరియా ఆసుపత్రి యంత్రాంగం
- ప్రజా వాయిస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన పేషంట్స్, రోగులు



పచ్చదనంపై గొడ్డలి వేటు

- జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో ఘటన
- ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన చెట్లకు కత్తెర
- నరికివేతపై అధికారుల అనుమతులపై స్పష్టత కరువు
- నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నారా?
- పట్టించుకోని అధికారుల తీరుపై విమర్శలు

.. **ప్రజా వాయిస్ జహీరాబాద్:** ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన చెట్ల పచ్చదనంపై గొడ్డలి వేటు అనే వార్త శీర్షిక ప్రజా వాయిస్ లో ఒక్క కథనాన్ని ప్రచురించడం జరిగింది. వెంటనే స్పందించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి యంత్రాంగం ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసి కత్తిరించిన చెట్లను తొలగించడం జరిగింది. ప్రజా వాయిస్ ఛానల్, పత్రిక ప్రజా సమస్యల కథనాలతో, అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు వారధిగా నిలుస్తున్న ప్రజా వాయిస్ కు పేషెంట్లు , రోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..



# భగ్గుమన్న జింకలగూడెం!!

- స్కార్పియోతో ఢీకొట్టిన ఘటనలో మౌలానా మృతి
- నిందితుడి ఇంటికి నిప్పు పెట్టిన ఆగ్రహితులు
- రంగంలోకి పోలీసు, సీఆర్ పీఎఫ్ బలగాలు

**ప్రజా వాయిస్ బూర్గుంపాడు** అక్రమ గోవుల తరలింపు వివాదంలో భాగంగా గత కొద్ది రోజులు క్రితం బూర్గంపాడు మండలం జింకలగూడం ప్రాంతానికి చెందిన షేక్ ఇస్మాయిల్ తన స్కార్పియో కారుతో షేక్ మౌలానాను ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించాడు ఈ ప్రమాదంలో మౌలానాకు తీవ్ర గాయాల చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ హాస్పటల్ తరలించడం జరిగింది. మౌలానా సోదరుడు షేక్ నాగుల్ మీరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే చికిత్స పొందుతున్న మౌలానా శనివారం మృతి చెందడంతో జింకలగూడెం గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మౌలానా మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహానికి గురై నిందితుడు షేక్ ఇస్మాయిల్ ఇంటి కి నిప్పంటించి ఆందోళనకు దిగారు.మౌలానా మృతదేహాన్ని నిందితుడు ఇస్మాయిల్ ఇంటి ఎదుటకు తీసుకువచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నాకు దిగారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న బూర్గంపాడు ఎస్‌హెచ్‌ఓ మేడ ప్రసాద్ వెంటనే పోలీసు సిబ్బందితో జింకలగూడెం గ్రామానికి చేరుకున్నారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా ఆందోళనకారులతో మాట్లాడి శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలను మోహరించి గ్రామంలో పరిస్థితిని పర్యవేక్షించారు.పరిస్థితి జటిలంగా మారడంతో, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూడా జింకలగూడెం గ్రామానికి చేరుకున్నాయి.పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి గ్రామంలో భద్రతా చర్యలు చేపట్టి పరిస్థితి అదుపు తప్పకుండా, ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు ఘర్షణలు చోటు చేసుకోకుండా ఉండేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా మౌలానా కుటుంబ సభ్యులు, బంధువులతో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మాట్లాడినట్లు సమాచారం. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు తెలిసింది. కాగా, నిందితుడు షేక్ ఇస్మాయిల్‌పై గతంలో పశువుల అక్రమ రవాణాకు సంబంధించి కొత్తగూడెం జిల్లాలో పలు కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం.







# కేటీఆర్ పర్యటనపై బీఆర్ఎస్ ఫోకస్

- సెప్టెంబర్ 3న మిర్యాలగూడకు కేటీఆర్
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం
- పర్యటన విజయవంతానికి పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యేల పిలుపు

**మిర్యాలగూడ,ప్రజా వాయిస్**. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) సెప్టెంబర్ 3న మిర్యాలగూడలో చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి పిలుపునిచ్చారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలులోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరును ప్రజల ముందుకు తీసుకెళ్లడమే కేటీఆర్ పర్యటన ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 3న జరిగే కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కదిలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో అల్లుబెల్లి అమరేందర్‌రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎం.డి. యూసుఫ్, ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, అన్నబీమోజు నాగార్జునచారి, ఎం.డి. ఇలియాస్‌ఖాన్, ఎం.డి. మగ్దుం పాషా, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, మట్టపల్లి సైదులు యాదవ్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య, ధనావత్ బాలాజీనాయక్, కుర్రా సేవ్యానాయక్, అంగోతు హతిరాం నాయక్, నిమ్మల నవీన్‌రెడ్డి, చౌగాని బిక్షంగౌడ్, అమరావతి సైదులు, ఖాజా మొహినుద్దీన్, కొత్త మరెడ్డి, పేరాల కృపాకర్‌రావు, పెండ్యాల పద్మ, షహనాజ్‌బేగం, కోదాటి రమా, ధూళిపాళ కళావతి, నంద్యాల శ్రీరాంరెడ్డి, బంటు శ్రీనివాస్, ఆయిల వెంకన్న, ధీరావత్ పాచునాయక్, ఎం.డి. షోయబ్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.8 కోట్ల గోల్ మాల్




- ఫిర్యాదులు చేసిన రైతు సంఘాలు, రైతులు
- విచారణ చేపట్టిన జిల్లా యంత్రాంగం
- డీసీసీబీ గత సీఈఓ, చైర్మన్ పై ఆరోపణలు
- విచారణలో మరిని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం
- ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీలో వెలుగులోకి అక్రమాల చిట్టా

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** ఉమ్మడిమెదక్ జిల్లా డీసీసీబీ బ్యాంకులో భారీ అవనితి బయట పడింది. రైతుల నుంచి ఇన్స్ పెక్షన్ చార్జీల పేరిట చైర్మన్ సీ ఈ ఓ ఇద్దరు కలిసి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేశారు. ఇన్ పెక్షన్ ఛార్జీలు వసూలు చేయాలంటూ గత సీఈఓను శ్రీనివాస్ 2025 జూన్ 16 నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా రైతుల నుంచి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఆరోప ణలు వస్తున్నాయి. అక్రమంగా ఇన్స్ పెక్షన్ చార్జీలు వసూలు చేయడంపై ఉమ్మడి జిల్లా రైతులు తీవ్ర ఆగ్రహం వక్తం చేస్తున్నారు. డీసీసీఈఓగా పనిచే సిన శ్రీనివాస్, ఇంకొందరు అధికారులు కలిసి ఈ వ్యవహారాన్ని చక్క బెట్టినట్లు ఆరోపిస్తున్నారు. కాగా శ్రీనివాస్ పై విచారణ జరుగుతుండగా ఆయనను నిజామాబాద్ కు బదిలీ చేశారు. కేవలం ఒక సర్క్యులర్ ద్వారా కోట్ల రూపాయాలు వసూలు చేయడంలో అధికారులు నిధులను భారీ మొత్తం దారి మళ్లింస్తున్నారు.రైతుల నుంచి ఇన్ ఫెక్షన్ చార్జీల పేరిట రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రైతుల నుంచి వసూల చేయడం ఆర్బీఐ, నాబార్డ్ గైడ్ లైన్స్ కు విరుద్ధం.

**నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు.. రైతులు**

దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల నుంచి ఇన్స్ పెక్షన్ చార్జీల పేరిట రూ.కోట్లు వసూలు చేశారు. ఉమ్మడి జిల్లాలో 80కి పైగా పీఏసీఎస్ బ్యాంకులు, 9 వేలమంది రైతులు ఉన్నారు. రైతుల నుంచి అదనంగా రూ.8కోట్లకు పైగానే వసూలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడా రైతుల నుంచి ఇన్స్ పెక్షన్ పేరుతో వసూలు చేయలేదు. దీనిని డీసీసీబీ సీఈఓ, చైర్మన్ ఇద్దరు కలిసి అక్రమంగా వసూలు చేశారు. వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలని ఇప్పటికే కలెక్టర్, డీసీఓ, అదనపు కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అక్రమంగా రైతుల నుంచి వసూలు చేసిన రూ.8 కోట్లు ఎక్కడున్నాయి. ఎక్కడికి వెళ్లాయి..? అనేది పూర్తి సమాచారం ఇవ్వడం లేదు. వీటిని తిరిగి రైతులకు చెల్లించాలి అనీ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**రైతుల నుంచి 1 శాతం ఇన్స్ పెక్షన్ చార్జీ వసూలు**

రుణాల పంపిణీ, ఉద్యోగుల వేతనాల నుంచి కోట్ల ఎ హెచ్ ఓ బ్యాంకులో నిబంధనలకు విరుద్ధంగా 10 సంవత్సరాలు అక్రమాలకు పాల్పడినట్లు రైతు సంఘాలు బాహాటంగా ఆరోపిస్తున్నాయి. అంతే కాకుండా బ్యాంకు ఉద్యోగులకు 60 రోజుల వేతనంగా ఎక్స్ గ్రాటీయా పేరుతో చెల్లించి అందులో నుంచి 20 రోజుల వేతనం తక్కువ చెల్లించి సీఈఓ బ్యాంకు చైర్మన్ వాటాలు తీసుకున్నారని ఆరోపిస్తున్నాడు. అదే విధంగా 50 మంది ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై కూడా రైతు సంఘాల నాయకులు రాష్ట్ర సహాకార శాఖ మంత్రికి ఫిర్యాదులు చేశారు. అంతే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 6 కొత్త బ్రాంచులు ఏర్పాటుతో పాటు మరో 20 బ్రాంచీలలో రెడోనేషన్ పనులు చేసి వారికి ఇష్టమైన కాంట్రాక్టర్లకు ఇచ్చి రూ.లక్షలను బ్యాంకుకు నష్టం చేసినట్లు ఆరోపిస్తున్నారు. రైతుల నుంచి రుణాల సమయంలో డబ్బులు వసూలు చేయలేదు. కానీ ఉమ్మడి మెదక్ డీసీసీబీ బ్యాంకు నుంచి ప్రత్యేకంగా సర్క్యూలర్ జారీ చేసి ఉమ్మడి జిల్లా రైతుల నుంచి సుమారు రూ.8 నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేసి భారీ కుంభకోణానికి తెరలేపారు. మరి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసిన డబ్బులు ఎక్కడికి వెళ్లాయనే విషయంపై విచారణ చేయాల్సిన అవసరం ఉంది. నిబంధనలు కాదని డబ్బులు వసూలు చేసిన వైరస్, డీసీసీబీ సీఈఓలపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. కేవలం రైతుల నుంచే కాకుండా ఉద్యోగుల బదిలీ ల్లోనూ భారీ ఎత్తున మసూళ్లు చేసినట్లురైతు సంఘాల నాయకులు, ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అయితే వీటిపై రైతు సంఘాల నాయకులు సహాకార మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు ఫిర్యాదులు చేశారు. దీంతో మంత్రి విదాచారణకు ఆదేశించారు. పూర్తి విచారణ చేస్తే మరిన్ని విషమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. రైతుల నుంచి గైడ్ లైన్స్ కు విరుద్ధంగా వసూలు చేసిన డబ్బులు ఎక్కడికి వెళ్లాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఈ డబ్బులను డీసీసీబీ చైర్మన్, గత సీఈఓ ఇద్దరు పంచుకున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తు న్నాయి. దీనిపై సమగ్రంగా విచారణ చేయాల్సిన అవసరం ఉంది.




# దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జీఎంను కలిసిన కాజీపేట కాంగ్రెస్ నాయకులు

- కాజీపేట అభివృద్ధి పనులు, రైల్వే సౌకర్యాలను వేగవంతం చేయాలని వినతి

**ప్రజా వాయిస్ హన్మకొండ** /కాజిపేటకాజీపేట ఆగస్టు 29: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవని హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అంకుస్ ఆధ్వర్యంలో కాజీపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా కాజీపేట ప్రాంత అభివృద్ధి, రైల్వే సౌకర్యాలు మరియు ప్రజల సమస్యలకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా కాజీపేట నూతన బస్టాండ్‌కు సంబంధించిన స్థలాన్ని త్వరితగతిన అప్పగించడం, కాజీపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూనిర్వాసితులు మరియు స్థానికులకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించడం, కాజీపేట జంక్షన్‌ను ప్రత్యేక రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేయడం, కాజీపేట నుంచి బోడగుట్ట ప్రాంతానికి రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి (FOB) నిర్మించడం వంటి డిమాండ్లను సమర్పించారు.అదేవిధంగా కాజీపేటలో అదనపు రైలు హాల్టులు కల్పించాలని, కోవిడ్ అనంతరం నిలిపివేసిన రైలు సర్వీసులను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు రహమతుల్లా మహమ్మద్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం–సికింద్రాబాద్ వందే భారత్, కర్ణాటక సంపర్క్ క్రాంతి, టాటానగర్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–సికింద్రాబాద్ గరీబ్ రథ్ వంటి ముఖ్యమైన రైళ్లకు కాజీపేటలో హాల్ట్ కల్పించాలని, అలాగే కాజీపేట–బెలగావి ఎక్స్‌ప్రెస్ తదితర నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలని కోరారు.కాజీపేట అభివృద్ధి, ప్రజల రవాణా సౌకర్యాలు, స్థానికుల ఉపాధి అవకాశాలకు సంబంధించిన ఈ సమస్యలను సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని జనరల్ మేనేజర్ ని కాంగ్రెస్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ పసునూరి మనోహర్, Ex- NSUI నేషనల్ కోఆర్డినేటర్ రహమతుల్లా మహమ్మద్, డివిజన్ అధ్యక్షులు పాలడుగుల ఆంజనేయులు, దొంగల కుమార్ యాదవ్, ఇప్ప శ్రీకాంత్, బైరబోయిన రమేష్ యాదవ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య





**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** బాలసముద్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (DSA) ఆధ్వర్యంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, క్రీడా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు మౌలిక వసతుల అభివృద్ధి ఎంతో అవసరమని తెలిపారు. స్విమ్మింగ్ వంటి క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు.జిల్లాలోని క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని ఎంపీ తెలిపారు. ఈ స్విమ్మింగ్ పూల్‌ను క్రీడాకారులు, యువత సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వాయిస్ ఎఫెక్ట్...

- డెంగ్యూ నివారణకు వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు
- పలువురి నుంచి రక్త నమూనాల సేకరణ
- సుల్తానాబాద్‌లో ప్రత్యేక వైద్య శిబిరం
- ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండొద్దు.
- జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి




ప్రజా వాయిస్

సుల్తానాబాద్ లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** 'సుల్తానాబాద్ లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు, చాప కింద నీరులా డెంగ్యూ వ్యాప్తి' అనే ప్రత్యేక కథనానికి మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు.సుల్తానాబాద్ మున్సిపాలిటీ 12 వ వార్డు పరిధిలో డెంగ్యూ కేసు గుర్తించడంతో వ్యాధి నివారణకు వైద్య, మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు.డాక్టర్ నిస్సీ క్రిస్టినా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ సింధుజ డెంగ్యూ బాధితుడి నివాసంతో పాటు పరిసర గృహాల్లో పైరెత్రం స్ప్రే చేయించారు. ప్రజలకు డెంగ్యూ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శరీర నొప్పులు తదితర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, 12వ వార్డు కౌన్సిలర్లు అమిరిశెట్టి శ్రావణి రాకేష్, హెల్త్ అసిస్టెంట్ రాజేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.రమేష్, మాజీ వార్డు మెంబర్ అమిరిశెట్టి తిరుపతి, ఏఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు సుజాత, స్వరూప, కోమల, సుగుణతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతిభకు అంగవైకల్యం అడ్డురాదు

- విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయాలి
- జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని

**ప్రజావాయిస్/వికారాబాద్:** ప్రత్యేక అవసరాలు గల (సిడబ్ల్యూఎస్ఎన్) విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారి ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు తోడ్పడాలని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని సూచించారు. శనివారం స్థానిక డైట్ కళాశాలలో సిడబ్ల్యూ ఎస్ఎన్ విద్యార్థుల తల్లిదండ్రులకు రెండు రోజుల అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుపేద సి డబ్ల్యూ ఎస్ ఎన్ విద్యార్థులను ప్రభుత్వ విద్యాశాఖ పరిధిలోకి తీసుకుని భవిత కేంద్రాల ద్వారా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్యా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో స్పెషల్ ఎడ్యుకేటర్ల ద్వారా సమగ్ర విద్య అందిస్తున్నామన్నారు.కార్యక్రమంలో పరిగి మండలానికి చెందిన బధిర విద్యార్థిని ఉప్పరి అక్షయ ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. ధరూర్ మండలం కుక్కింద గ్రామానికి చెందిన సంజీవ్ కుమార్ పాఠశాల క్రమశిక్షణను ప్రదర్శించాడు. జిల్లాలోని 20 మండలాల నుంచి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అనుభవాలను, పొందుతున్న సేవలను వివరించారు. సీఎంఓ రజినీకుమారి, రిసోర్స్ పర్సన్స్ మార్క యాకాంతం, దండు రమేష్, నక్క రాములు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఐ ఈ ఆర్ పి లు పాల్గొన్నారు.



# విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

- జి.జే.సి. ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి
- క్రీడాలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయి
- కళాశాల క్రీడా ఇంచార్జి మరిపెల్ల రవి ప్రసాద్
- .జూనియర్ కాలేజీలో మేజర్ ధ్యాన్ చంద్ 121 జయంతి వేడుకలు

**ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరో** శనివారం స్థానిక జనగామ ( ధర్మ కంచ ) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ నాముని పావని కుమారి అధ్యక్షతన మరియు క్రీడా ఇంచార్జి రవిప్రసాద్ ఆధ్వర్యంలో భారత హాకీ మాంత్రికుడు, ది మెజీషియన్ మేజర్ ధ్యాన్ చంద్ 121 వ జయంతిని మరియు జాతీయ క్రీడా దినోత్సవాన్ని క్రీడా విద్యార్థులచే క్రీడా ప్రతిజ్ఞ చేయించి, ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్ చంద్ హాకీ క్రీడా ద్వారా భారత్ కు ఒలింపిక్స్ లో మూడు బంగారు పథకాలు సాధించాడని, భారత ప్రభుత్వం పద్మ భూషణ్ ద్వారా అతనిని సత్కరించిందని తెలుపుతూ విద్యార్థులందరూ కూడా క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ పావని మేడం సూచించారు.కళాశాల క్రీడా ఇంచార్జి మరిపెల్ల రవి ప్రసాద్ మాట్లాడుతూ.. యువత అన్ని రంగాలలో ముందుండాలని క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోదపడతాయన్నారు. ప్రపంచంలోనే భారతదేశంలో అత్యధిక శాతం యువత ఉందని కావున విద్యార్థులారా మీరందరూ మీకు నచ్చిన క్రీడాలలో పాల్గొని శారీరక మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. భారత ప్రభుత్వం మరియు తెలంగాణ ప్రభుత్వం క్రీడాలకు ప్రాధాన్యం ఇస్తుందని అదేవిధంగా ధ్యాన్ చంద్ కి భారతరత్న పురస్కారాన్ని అందించాలని అయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ సెక్రటరీ వై.శ్రీకాంత్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ వస్కుల శ్రీనివాస్, డాక్టర్ వరుధిని, గణేష్, తిరుమలేష్, ఇశ్రాత్ భాను,రజిత, ప్రియదర్శిని, రేఖ, కరుణాకర్, నాగేందర్, కాపర్తి శ్రీనివాస్, సురేష్,జ్యోతి, సబిహా బేగం అ, నాజిన్ అధ్యాపకేతర బృందం ప్రసన్న, శ్రీనివాస్, రవి మరియు విద్యార్థులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



# బయట వైరము.. లోపల స్నేహమా?

- స్పీకర్ గడ్డం ప్రసాద్–మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మధ్య కొనసాగుతున్న రాజకీయ రగడ
- ఒకే వేదికపై ఇరువురి నేతల ఆత్మీయ పలకరింపులు
- రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ

**ప్రజావాయిస్/వికారాబాద్:** వికారాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మధ్య రాజకీయ విమర్శలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. గతంలో మెతుకు ఆనంద్ చేసిన ఆరోపణలపై స్పీకర్ రూ.10 కోట్ల పరువు నష్టం నోటీసులు జారీ చేయడం వివాదాన్ని మరింత వేడెక్కించింది. మరోవైపు ప్రభుత్వ కళాశాలల సమస్యలు, అభివృద్ధి పనులపై మెతుకు ఆనంద్ ప్రశ్నలు సంధిస్తున్నారు. అయితే, తాజాగా ఓ దినపత్రిక వార్షికోత్సవ కార్యక్రమంలో ఇరువురు నేతలు కలసి కనిపించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో "బయట వైరము.. లోపల స్నేహము" అన్న చర్చకు తెరలేచింది.






## నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం

- మదర్ థెరిస్సా పొదుపు సమితిపై ఆరోపణలు సరికావు
- వాస్తవాలు మా వద్ద ఉన్నాయి
- మీడియా సమావేశంలో సమితి నిర్వాహకుల స్పష్టీకరణ

**ప్రజా వాయిస్ మంథని** మదర్ థెరిస్సా పొదుపు సమితిపై నామని హరికృష్ణ చేసినవి పూర్తిగా నిరాధార ఆరోపణలని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని సమితి లోడీ సంస్థ మంథని డివిజన్ కోఆర్డినేటర్ మేకల మల్లేశం పేర్కొన్నారు. శనివారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ (డబ్ల్యుజే) కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మహిళలకు ఆర్థికంగా చేయూత అందించాలనే ఉద్దేశంతో 2001 నవంబర్ 1న సమితిని ప్రారంభించామని, నాటి నుంచి నేటి వరకు సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతోందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పత్రికల ద్వారా తప్పుడు ప్రచారం చేయడం ఆవేదన కలిగించిందని, సమితికి సంబంధించిన అన్ని లెక్కలు, వాస్తవాలను మీడియా ముందు ఉంచామని తెలిపారు. సమితి బాధ్యులు సమితి అధ్యక్షురాలు మాదేశి పద్మ మాట్లాడుతూ.. గత 26 ఏళ్లుగా సమితి విజయవంతంగా కొనసాగుతోందని, అన్ని వివరాలూ పారదర్శకంగా ఉన్నాయని స్పష్టం చేశారు. సమితి కోశాధికారి నామని సుగుణ మాట్లాడుతూ.. సంస్థ ఎదుగుదలను ఓర్వలేకనే హరికృష్ణ ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. నోబెల్ బహుమతి గ్రహీత మదర్ థెరిసా ఆశయాలను, మహిళల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించడం సరికాదన్నారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో సమితి డైరెక్టర్లు ఎలగందుల సరిత, పుల్లె లక్ష్మి, పుల్లె రాజేశ్వరి, తాత యాదమ్మ, ముప్పిడి మల్లేశ్వరి, ఎర్ర రాజేశ్వరి, మైదం శారద తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లాలో జూనియర్ కళాశాల విద్యార్థులకు అందని ఉచిత భోజన పథకం

- రాయపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కోసం విద్యార్థుల ఎదురు చూపు
- నెలలు గడిచినా విద్యార్థులకు అందని మధ్యాహ్న భోజన సదుపాయం
- రాయపర్తి లో గడచిన సంవత్సరం కంటే ఈసారి జూనియర్ కళాశాలలో ఎక్కువ ప్రవేశాలు
- రాయపర్తి జూనియర్ కళాశాలకు గ్రహణం వీడేది ఎన్నడు అంటూ విద్యావేత్తల ఆగ్రహం
- ఎమ్మెల్యే మరియు కలెక్టర్ చొరవ తీసుకొని వెంటనే పథకాన్ని అమలు చేసేలా చూడాలని విద్యార్థుల విన్నపం
- విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనం పై అవగాహన కల్పించి ప్రవేశాలు చేర్పించాం..కళాశాల ప్రిన్సిపల్..

**ప్రజా వాయిస్ వరంగల్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుడుగులు వేసిన అవి నత్తనడకనే ముందుకు సాగుతున్నాయి.ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం భోజన పథకం అమలు చేయడంలో మాటలకే పరిమితమైంది.వరంగల్ జిల్లా వ్యాప్తంగాదాదాపు 20 కి పైగా జూనియర్ కళాశాలలు ఉండగా కేవలం ఆరు కళాశాలల్లో ఈ పథకాన్ని ప్రారంభం చేసి మిగతా కళాశాలకు మాత్రం అందని ద్రాక్షలా మిగిలిపోయాయి.నూతన విద్యాసంవత్సరాన్ని మురస్కరించుకొని జూనియర్ కళాశాల లో విద్యార్థులకు ఆహారపతకాన్ని అందిస్తున్నామని చెప్పడంతో పేదమధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు హర్షం వ్యక్తం చేసిన ఆది కాస్త నిరాశగానే మిగిలింది.





### రాయపర్తి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజన సదుపాయం వెంటనే కల్పించాలి..

ప్రభుత్వ పాఠశాలలకే పరిమితమైన ఉదయం బ్రేక్‌ఫాస్ట్ (సిఎం టిఫిన్/ఉపాహారం) మరియు మధ్యాహ్న భోజన పథకాలను, ఈ 2026 విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేయడానికి శ్రీకారం చుట్టినప్పటికీ రాయపర్తి మండలం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మాత్రం గ్రహణం విడటంలేదని విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మండలంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతూ జూనియర్ కళాశాలలో దాదాపు 200 మంది విద్యార్థులు నూతన ప్రవేశాల ద్వారా మునుపటికంటే ఈ సంవత్సరం ఎక్కువమంది ప్రవేశం తీసుకున్నారు.ఐతే ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఉచిత పోషకాహార పథకాల అమలుతో విద్యార్థుల సంఖ్య పెరిగినా నేటి వరకు కూడా పథకం అమలు కాకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్నం పూటే ఇంటికి వెళ్ళే పరిస్థితి నెలకొంది.పేద కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులు ఆకలి బాధలు లేకుండా, ఉత్సాహంగా చదువుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అధ్యాపక బృందం వివరించి చెప్పి ప్రవేశాలు కల్పించినా నిరాశే ఎదురవుతుందని, ప్రభుత్వ కళాశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దందుకు ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుందని వెంటనే రాయపర్తి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించాలని విద్యార్థులు ఎమ్మెల్యేని, కలెక్టర్ నీ కోరుతున్నారు .

### మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామని చెప్పడంతో ఈ సంవత్సరం ఎక్కువ ప్రవేశాలు జరిగాయి..

ప్రిన్సిపాల్ .రాయపర్తి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈసారి మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నామని విద్యార్థులకు మరియు విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పడం జరిగింది.దాంతో వారి తల్లిదండ్రులు కూడా ఉన్నతమైన విద్యతోపాటుగా పోషక విలువలతో కూడిన ఆహారం కూడా ప్రభుత్వం అందిస్తుందనే నమ్మకంతో కార్పొరేట్ స్థాయి విద్యను కూడా పిల్లలు పొందుతున్నారు అనే భావనతో కళాశాలలకు పంపించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ జయ కుమారి పాత్ర తెలిపారు. కళాశాలలో ప్రారంభమై నెలలు గడుస్తున్న ఇప్పటివరకు ఉచిత పోషక మధ్యాహ్నం భోజన పథకం అమలు కాలేదు అని దీంతో విద్యార్థులు మధ్యాహ్నం పూటే ఇంటికి వెళ్లే పరిస్థితి నెలకొందని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. కలెక్టర్ మరియు ఎమ్మెల్యే తక్షణమే స్పందించి విద్యార్థులకు భోజన సదుపాయాన్ని వెంటనే కల్పించాలని ప్రిన్సిపల్ కోరారు..

# వేపచెట్టు వివాదం...రక్తపాతానికి దారి

- 25 ఏళ్లుగా కొనసాగుతున్న పాత కక్షలు
- ఇద్దరి దారుణ హత్య
- ఎస్ఐపై దాడి...తలకు తీవ్ర గాయం

**ప్రజా వాయిస్, మేళ్లచెరువు, ఆగస్టు 29:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాలో వేపచెట్టు వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సుమారు 25 ఏళ్లుగా కొనసాగుతున్నట్లు చెబుతున్న ఈ వివాదం చివరకు ఇద్దరి ప్రాణాలను బలిగొంది. గొడ్డళ్లతో జరిగిన దాడుల్లో ఇద్దరు మృతి చెందగా, ఘటనను అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన పోలీసు అధికారిపై కూడా దాడి జరగడం కలకలం రేపింది.ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయంలో రెండు వర్గాల మధ్య చాలాకాలంగా వివాదం కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం ఇరువర్గాల మధ్య మరోసారి ఘర్షణ చోటుచేసుకుంది. పరిస్థితి ఒక్కసారిగా అదుపుతప్పడంతో గొడ్డళ్లతో పరస్పరం దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది.ఈ దాడిలో అమరబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం. అనంతరం భూక్య సైదాపై కూడా గొడ్డలితో దాడి జరగడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా సైదా మృతి చెందినట్లు సమాచారం.

### ఎస్ఐపై రాళ్లు, గొడ్డలితో దాడి

ఘటనపై సమాచారం అందుకున్న మేళ్లచెరువు పోలీసులు వెంటనే ఎర్రగట్టు తండాకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఇరువర్గాలను చెదరగొట్టే క్రమంలో కొందరు ఆగ్రహంతో పోలీసులపై దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మేళ్లచెరువు ఎస్ఐ నవీన్ పై రాళ్లతో దాడి జరగడంతో ఆయన తలకు గాయమైంది. మరోవైపు ఎస్ఐపై గొడ్డలితో దాడికి కూడా ప్రయత్నించినట్లు సమాచారం. గాయపడిన ఎస్ఐ నవీన్‌ను చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనతో ఎర్రగట్టు తండాలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.
పోలీసుల అదుపులో పరిస్థితిసమాచారం అందుకున్న కోదాడ డీస్పీ అదనపు బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి



అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తండాలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఘర్షణకు కారణమైన పరిస్థితులు, దాడిలో పాల్గొన్న వ్యక్తులు, గతంలో ఈ వివాదంపై జరిగిన పరిణామాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించే ఏర్పాట్లు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, ఘర్షణకు దారితీసిన పూర్తి కారణాలు, బాధ్యుల వివరాలను విచారణ అనంతరం వెల్లడించనున్నారు.ఒక చిన్న వేపచెట్టు విషయంలో మొదలైన వివాదం.. పాతికేళ్లుగా పెరుగుతూ చివరకు రెండు ప్రాణాలను బలిగొనడం, పోలీసు అధికారిపై దాడికి దారితీయడం ఎర్రగట్టు తండాలో తీవ్ర ఆందోళనకు కారణమైంది.

# మా భూములు పోతే మేమెట్లా బతకాలి

- షాబాద్ రేడియల్ రోడ్డు జంక్షన్ డిజైన్ పై రైతులు ఆగ్రహం
- ఒకవైపు తక్కువ తమవైపు ఎక్కువగా భూములు పోతున్నాయని ఆవేదన
- షాబాద్ ఎమ్మార్వోకు రైతుల వినతిపత్రం
- రైతుల వైపు నిలిచిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన రెడ్డి
- 3 రోజుల్లో పరిశీలన చేస్తామని ఎమ్మార్వో హామీ



**(ప్రజా వాయిస్ షాబాద్)షాబాద్** మండల పరిధిలోని సంకేపల్లి గూడ, మల్లారెడ్డి గూడ గ్రామాల్లో రేడియల్ రోడ్డు జంక్షన్ నిర్మాణం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తోంది రోడ్డు విస్తరణ డిజైన్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ స్థానిక రైతులు శనివారం అధికారుల పెగ్ మార్కింగ్ పనులను అడ్డుకుని తమ ఆందోళనను వ్యక్తపరిచారు రియల్ ఎస్టేట్ లబ్ధి కోసమేనా రైతుల ఆరోపణలు కూడలి నిర్మాణం కోసం జంక్షన్ పరిధిలో సుమారు 46 ఎకరాల భూమి సేకరిస్తున్నారు అయితే రోడ్డుకు ఒకవైపు ఉన్న భూములు స్థానికులు కాని పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చెందినవి కావడంతో వారికి అనుకూలంగా డిజైన్ రూపొందించారని రైతులు ఆరోపిస్తున్నారు దీనివల్ల నిరుపేద, స్థానిక రైతుల వ్యవసాయ భూములు ఎక్కువగా పోతున్నాయని జీవనాధారం దెబ్బతింటోందని వాపోయారు అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని అయితే సమతుల్యమైన రీ-డిజైన్‌తో తమకు న్యాయం చేయాలని కోరుతూ షాబాద్ తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారుఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ.. తమ పరిధిలో 1 ఎకరం, 2 ఎకరాలు, 3 ఎకరాల నుండి 8 ఎకరాల వరకు భూమి ఉన్న చిన్న, పెద్ద రైతుల భూములు ఈ ప్రాజెక్టు కింద పోతున్నాయని కన్నీటి పర్యంతమయ్యారు పక్కనే ఉన్న ఇతర ల్యాండ్‌లను వదిలేసి, గ్రామ ప్రజలైన తమ భూములను మాత్రమే సేకరించడం వెనుక ఉన్న అలైన్‌మెంట్‌పై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు భూమిని నమ్ముకుని బతుకుతున్న తాము ఈ ప్రాజెక్ట్ వల్ల రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు విషయం తెలిసిన వెంటనే రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అక్కడికి చేరుకుని రైతులతో నేరుగా మాట్లాడారు వారి సమస్యలను ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్తూ అభివృద్ధి పనులతో పాటు రైతుల ప్రయోజనాలను కాపాడాలని తక్కువ నష్టం జరిగేలా ప్రాజెక్టును రీ-డిజైన్ చేయాలని అధికారులకు సూచించారు దీనిపై షాబాద్ ఎమ్మార్వో స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్నది కేవలం సర్వే పెగ్ మార్కింగ్ మాత్రమేనని తుది నిర్ణయం కాదని స్పష్టం చేశారు రైతుల అభ్యంతరాలను పరిశీలించి మూడు రోజుల్లో సానుకూలంగా పున పరిశీలన చేసి రైతులకు న్యాయం జరిగేలా మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు.



## రైతుల మాట.. ఎమ్మెల్యే జైవీర్ బాట

- వెంటనే కదిలిన ఎమ్మెల్యే
- మేజర్ కాలువకు నీటి విడుదల
- చెరువులు, కుంటలు నింపేందుకు రైతుల విజ్ఞప్తి
- అధికారులతో మాట్లాడి ఆగస్టు 29 ఉదయం నీటిని విడుదల చేయించిన జైవీర్ రెడ్డి
- ఎమ్మెల్యే చొరవపై రాజవరం మేజర్ పరిధి రైతుల కృతజ్ఞతలు

**ప్రజా వాయిస్, తిరుమలగిరి:** రైతుల విజ్ఞప్తికి స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి తక్షణమే స్పందించి మేజర్ కాలువకు నీటిని విడుదల చేయించారు. తిరుమలగిరి మండల కేంద్రంతో పాటు రాజవరం మేజర్ పరిధిలోని వివిధ గ్రామపంచాయతీలకు చెందిన రైతులు గడ్డం సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి, మేజర్ కాలువ ద్వారా వచ్చే నీటిని గ్రామాల్లోని చెరువులు, కుంటలు నింపేందుకు విడుదల చేయాలని కోరారు. రైతుల సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆగస్టు 29 ఉదయం మేజర్ కాలువకు నీటిని విడుదల చేయించారు. రైతుల విజ్ఞప్తిపై ప్రత్యేక చొరవ చూపి తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే జైవీర్ రెడ్డికి, సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేసిన గడ్డం సాగర్ రెడ్డికి రాజవరం మేజర్ పరిధిలోని గ్రామపంచాయతీల రైతులు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే నాయకత్వాన్ని రైతులు అభినందించారు.

# గంజాయి చాక్లెట్ల అక్రమ విక్రయంపై శామీర్‌పేట్ పోలీసుల దాడి

- 5,298 గంజాయి చాక్లెట్లు స్వాధీనం
- ఒకరు అరెస్ట్

**మేడ్చల్, శామీర్ పేట్ / ప్రజా వాయిస్ :** గంజాయి చాక్లెట్ల అక్రమ విక్రయానికి పాల్పడుతున్న వ్యక్తిని శామీర్‌పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి భారీగా గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. శామీర్‌పేట్ మండలం తుమ్ముకుంట గ్రామంలోని చంద్రారెడ్డి కాలనీలో గల జీ+1 భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఓ గదిలో గంజాయి చాక్లెట్లను నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు శామీర్‌పేట్ పోలీసులు శుక్రవారం (28-08-2026) తనిఖీలు నిర్వహించి బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లా గంగౌలి గ్రామానికి చెందిన బైద్నాద్ కుమార్ (29)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 5,298 గంజాయి చాక్లెట్లు, మొత్తం 24.59 కిలోల బరువు కలిగిన వాటిని 12 కవర్లలో ప్యాక్ చేసి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వివో వై02టీ మొబైల్ ఫోన్, రూ.1,760 నగదు, అలాగే గంజాయి చాక్లెట్లను నిల్వ చేసేందుకు ఉపయోగించిన లైట్ బ్రౌన్ రంగు 'హాక్ బర్డ్' సూట్‌కేస్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### బీహార్ నుంచి తెచ్చి విక్రయాలు

పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితుడు, అతని భార్య పూజా కుమారి కలిసి తుమ్ముకుంటలో పాన్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. పాన్‌షాప్ ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో బీహార్ నుంచి తక్కువ ధరకు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి స్థానికంగా అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వెల్లడించిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రంలోని దర్భంగా జిల్లా ధనౌలి గ్రామంలోని బెహ్రీ బజార్ నుంచి గంజాయి చాక్లెట్లను కొనుగోలు చేసి తుమ్ముకుంటకు తీసుకొచ్చినట్లు తెలిసింది. జూన్ 2026లో అతని భార్య పూజా కుమారి బీహార్‌కు వెళ్లి చాక్లెట్లను కొనుగోలు చేసి సూట్‌కేస్‌లో తీసుకొచ్చినట్లు




పోలీసులు తెలిపారు. పోలీసుల తనిఖీలకు చిక్కకుండా పాన్‌షాప్‌లో కాకుండా ఇంట్లోనే చాక్లెట్లను నిల్వ ఉంచి, పాన్‌షాప్‌కు వచ్చే వినియోగదారులను ఇంటికి తీసుకెళ్లి విక్రయించేవారని విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. గంజాయి చాక్లెట్ల విక్రయానికి సంబంధించిన నగదు లావాదేవీలతో పాటు గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా కూడా చెల్లింపులు స్వీకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### పరారీలో భార్య....

ఈ వ్యవహారంలో నిందితుడి భార్య పూజా కుమారి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

### కేసు నమోదు చేసిన పోలీసులు

ఈ ఘటనపై క్రైం నంబర్ 623/2026గా ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(c) r/w 20(b)(ii)(C), సెక్షన్ 29 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ దాడిని శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎం. శశివర్ధన్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ కె. నరసింహారెడ్డి మార్గదర్శకత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. పోలీసుల పనితీరును ఉన్నతాధికారులు అభినందించి, ఉత్తమ పనితీరుకు తగిన ప్రోత్సాహకం అందజేస్తామని తెలిపారు.

### ప్రజలకు పోలీసుల సూచన

గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, రవాణా, నిల్వ లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు ప్రజలను కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.



## సొంత ఖర్చుతో పాఠశాలకు ప్రొజెక్టర్ బహూకరణ

- డిజిటల్ విద్యకు ఉపాధ్యాయుడు డాక్టర్ వి.గోపీనాథ్ చేయూత

**ప్రజా వాయిస్–గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఎం.పి.పి.ఎస్ పాటీమీది గూడెం పాఠశాలకు సెకండరీ గ్రేడ్ టీచర్, ఒక్కరూ మారిన చాలు ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ వి.గోపీనాథ్ తన సొంత ఖర్చుతో ప్రొజెక్టర్‌ను బహూకరించారు. విద్యార్థులకు డిజిటల్ విద్యను మరింత చేరువ చేసి, నాణ్యమైన బోధన అందించాలనే ఉద్దేశంతో ఆయన ఈ ప్రొజెక్టర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలతకు అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దృశ్య–శ్రవణ పద్ధతిలో బోధించడం ద్వారా పాఠ్యాంశాలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పాఠశాలల్లో సాంకేతిక వనరుల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థుల ప్రయోజనం కోసం తన సొంత ఖర్చుతో ప్రొజెక్టర్‌ను అందించిన డాక్టర్ గోపీనాథ్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత, అంగన్వాడీ టీచర్ పద్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



## బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- నేటి బాలలే భవిష్యత్తు దేశ సంపద
- రామన్నపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య

**ప్రజా వాయిస్/అడ్డగూడూరు:** బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రామన్నపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని కోటమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశానుసారం, మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యా వివాహల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాలల హక్కుల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటి బాలలే భవిష్యత్తు దేశ సంపదని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహన చట్టాలు, ఫోక్సో, గంజాయి మరియు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మానసిక, శారీరక వేధింపులు ఎదురైనప్పుడు విద్యార్థినీలు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. 1098, 100, 108, 112 టోల్ ఫ్రీ నెంబర్ ల ఉపయోగాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచర్ల రాజ్యవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ అడ్వకేట్లు డేవిడ్, ప్యానల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్, అగ్రి లీగలైడ్ క్లినిక్ కే. శ్రీశైలం, లీగల్ సర్వీస్ ప్రతినిధి కురుమేటి యాదయ్య, పాఠశాల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయలక్ష్మి , సర్పంచ్ పాశం విశ్వవర్ధన్ రావు, ఏపీసీ చైర్మన్ చిత్తలూరి సరిత, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ అధికారులు, గ్రామపంచాయతీ కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

## కొడవళ్లతో మొక్కజొన్న పంట నాశనం

- రైతు కుటుంబానికి కన్నీళ్లే మిగిలాయి

**ప్రజావాయిస్/మోమిన్‌పేట్:**వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని సైదలీపూర్ గ్రామంలో రైతు ఉద్దాల యేసయ్యకు చెందిన ఎకరం మొక్కజొన్న పంటను గుర్తుతెలియని వ్యక్తులు కొడవళ్లతో పూర్తిగా కోసి ధ్వంసం చేశారు. పంట చేతికొచ్చే సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో రైతు కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది.పొలానికి వెళ్లిన యేసయ్య పంట మొత్తం నేలకొరిగి ఉండటాన్ని చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఏఈఓ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.రైతు కష్టపడి సాగు చేసిన పంటను



ఇలా ధ్వంసం చేయడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టంతో తీవ్రంగా నష్టపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కుటుంబం కోరుతోంది.

# సింగరేణిని దోచుకోవడానికే 'రివ్యూ' నాటకాలు!

- సింగరేణి ఆస్తులు, భూములను కట్టబెట్టేందుకే ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కుట్రలు
- ఎమ్మెల్యేకు సమీక్ష చేసే అధికారం ఎవరిచ్చారు?
- కార్మికుల క్వార్టర్లు కూలగొట్టి రోడ్డున పడేస్తారా?
- సింగరేణి సిఎండి తక్షణమే స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలి
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్




**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల దోపిడీ, అక్రమాలు శృతిమించాయని, సింగరేణి ఆస్తులను కట్టబెట్టుకోవడంతో పాటు కార్మికులు, చిరు వ్యాపారుల పొట్టకొట్టే కుట్రలు చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. శనివారం రామగుండంలోని బిఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

### అధికారం ఎవరిచ్చారు?

స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ, జీఎంతో కలిసి 'సింగరేణి వ్యాప్త రివ్యూ నిర్వహించడంపై కోరుకంటి చందర్ తీవ్ర స్థాయిలో ఆక్షేపించారు. అసలు సింగరేణి వ్యాప్తంగా సమీక్ష నిర్వహించడానికి ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌కు ఉన్న అధికారం ఏమిటి? ఆయనకు ఆ అధికారం సిఎండి ఇచ్చారా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చారా? లేక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చారా? అని ప్రశ్నించారు. సింగరేణి అధికారులను ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు పిలిపించుకుని కార్మికుల్లో సందేహాలు, భయాందోళనలు రేకెత్తిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుల దోపిడీ కోసమేనా? స్థానిక ఓల్డ్ అశోక్ నగర్ భూములను అప్పగించడానికి, ప్రైవేట్ నిర్మాణాల పేరుతో కాంగ్రెస్ నాయకులు అక్రమాలకు పాల్పడటానికి, స్థలాలను నచ్చినట్లు అమ్ముకోవడానికి అవకాశాలు ఇచ్చేందుకే డైరెక్టర్ ఆపరేషన్స్‌తో కలిసి ఈ సమీక్షలు జరుపుతున్నారని చందర్ ఆరోపించారు. సింగరేణి స్థలాల్లో నిర్మాణాలు జరిగితే సింగరేణి యాజమాన్యం బోర్డులు ఉండాలి కానీ, కాంగ్రెస్ నాయకుల ఫోటోలు పెట్టుకోవడం ఏంటని నిలదీశారు.

### సిఎస్ఆర్ నిధులపై ఎందుకు మాట్లాడరు?

బిఆర్ఎస్ హయాంలో కెటిఆర్, హరీష్ రావుల మార్గదర్శకత్వంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి నిధులు 500 కోట్ల రూపాయలతో మెడికల్ కాలేజీ (సిమ్స్ - సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) సాధించడమే కాకుండా, అందులో 5% సీట్లు సింగరేణి కార్మికుల పిల్లలకే దక్కేలా చేశామని గుర్తుచేశారు. కానీ నేడు సిఎస్ఆర్ నిధుల గురించి గానీ, కార్మికుల సంక్షేమం గురించి గానీ ఎమ్మెల్యే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

### కార్మికుల క్వార్టర్లు కూల్చేస్తున్నారు..

సింగరేణి కార్మికులు నివాసముంటున్న క్వార్టర్లను బలవంతంగా ఖాళీ చేయించి, కూలగొడుతూ వారిని రోడ్డున పడేస్తున్నారని చందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ధర్నాలు చేస్తున్నా, ప్రశ్నిస్తున్నా పట్టించుకోకుండా అధికారులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

### సిఎండి స్పష్టత ఇవ్వాలి:

అసలు సింగరేణి యాజమాన్యం ఏ అధికారంతో ఎమ్మెల్యేలకు ఆస్తులను, భూములను అప్పగిస్తోందో సింగరేణి సిఎండి తక్షణమే స్పందించి బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీవితాలతో, సింగరేణి హక్కులతో ఆడుకుంటే బిఆర్ఎస్ పార్టీ ఊరుకోదని, ప్రజాక్షేత్రంలోనూ, సింగరేణి వ్యాప్తంగానూ పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని చందర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో మిర్యాల రాజారెడ్డి, కౌశిక్ హరి, నూనె కొమురయ్య, మురళీధర్ రావు, హరీష్ రెడ్డి, మాదరి రామమూర్తి, అంతర్గాం మండల అధ్యక్షుడు సంతోష్‌తో పాటు ఇతర మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు మరియు కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా వాయిస్ కథనానికి స్పందన

- గుంతల రోడ్డుకు రిపేర్లుగుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు
- ప్రయాణికులకు ఊరట



**ప్రజా వాయిస్ బిబిపేట్**, ఆగస్టు 29: కామారెడ్డి నియోజకవర్గంలో అతిపెద్ద చెరువు అయినా బిబిపేట చెరువు కిందఉప్పరపల్లి–బీబీపేట గ్రామాల రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న ప్రజా సమస్య వార్తను ప్రజా వాయిస్ పత్రికలో వ చ్చింది. అ ధికారులు వెంటనే స్పందించి మరమ్మతు పనులు చేపట్టారు. వార్త కథనానికి స్పందించారు రహదారిపై ఉన్న గుంతలను పూడ్చే పనులు చేపట్టారు. గ్రామ ప్రజల తరపున ఎంపీటీసీ కొరివి నరసింహులు పలుమార్లు పత్రిక ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభమయ్యాయని గ్రామస్థులు తెలిపారు. రహదారి మరమ్మతులకు స్పందించిన అధికారులకు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బందికి, ప్రజా వాయిస్ పత్రిక కు ఉప్పరపల్లి గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో పరిష్కరించాల్సిన పలు సమస్యలు ఉన్నాయని, వాటిని కూడా ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని తాజా మాజీ ఎంపీటీసీ నీరజ నర్సింలు కోరారు.



గుంతలమయంగా రోడ్లు..

## ఒకవైపు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కాన్ఫరెన్స్

- మరోవైపు డాక్టర్ల డుమ్మాలు
- ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ప్రైవేట్ హాస్పటల్ పైనే దృష్టి
- ప్రభుత్వ దవఖానాలో వేయిలల్లో జీతాలు
- ప్రైవేట్ లో అయితే లక్షలు సంపాదించవచ్చు
- జోగిపేటలో ల్యాబ్ టెక్నీషియన్ చేతివాటం
- రక్త పరీక్షలు కావాలంటే నా దగ్గరికి రావాలి
- ఇది మంత్రి సొంత నియోజకవర్గ ఆసుపత్రి దుస్థితి



**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో నిరుపేదలకు ఏ రకమైన వైద్య సేవలు అందుతున్నాయి.. అధికారులు క్షేత్రస్థాయిలో ఎవరు పర్యవేక్షిస్తున్నారు...చేస్తున్నారు.. రావాల్సిన డాక్టర్లు ఎంతమంది వచ్చింది ఎంత ఎంత మంది అనేది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తన అధికార కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎలా రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్నారు అనేది తెలియదు కానీ చేరవతో పాటు జోగిపేట ( రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జోగిపేట ఏరియా ఆసుపత్రిలో ) మాత్రం కేవలం 22 మంది గాను 10 మంది డాక్టర్లు మాత్రమే తిధులు నిర్వహిస్తున్నారు. మిగతా డాక్టర్లు అధికారికంగా సెలవుల్లో వెళ్ళింది ఎంతమంది... అనధికారికంగా విధులకు హాజరు కాంతి ఎంత మంది అన్నది అధికారులే తేల్చాలి. సాక్షాత్తు రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ పై విమర్శలు ఎన్ని వస్తున్నా క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది లో మాత్రం మార్పు రావడం లేదు. దీనిపై మంత్రి ఇలా స్పందిస్తారో వేచి చూడాలి.

### రక్త పరీక్షలు ఇక్కడ కాదు.?

ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయవలసింది ఇక్కడ కాదు... కొంచెం దూరం వెళ్లాక ఒక ప్రైవేట్ క్లీనింగ్ ఉంటుంది అక్కడికి వెళ్లి చేయించుకోండి.. అంటూ ల్యాబ్ టెక్నీషియన్ ఒకరు సూచన చేస్తారు. తప్పదు కదా అనుకోని అక్కడికి వెళ్ళితే వెయ్యి రూపాయలు తీసుకుంటే గానీ అక్కడికి వెళ్ళాక రక్త పరిస్థితులకు సంబంధించిన రిపోర్టులు మాత్రం ఇవ్వరు. దీనికి ప్రధాన కారణం ఆ ల్యాబ్ కు సంబంధించిన టెక్నీషియన్ ప్రభుత్వ ఆసుపత్రికి సమస్య లాప్టాస్ ల కోసం ఆస్పత్రికి రావాల్సి ఉంటుంది. కానీ మీ అవసరాల కోసం మీరు వస్తే గాని నేను చేయలేను తాను రాలేను పరిస్థితి అంటూ తేల్చి చెప్తున్నారు. ఇది మంత్రి నియోజకవర్గం లో నెలకొన్న వైద్య ఆరోగ్య పరిస్థితి.

## తెలుగు తల్లిని మరవొద్దు.. అమ్మ భాషను చంపొద్దు!

- ఇంగ్లీష్ మోజులో పడి మాతృభాషను విస్మరించొద్దు
- తెలుగు వెలుగును భావితరాలకు అందించాలి
- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య



**ప్రజా వాయిస్, పెద్దపల్లి** అమ్మను ఎంతగా ప్రేమిస్తామో.. అమ్మ భాషను కూడా అంతే గౌరవించాలి అని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు. ఇంగ్లీష్ భాషపై మోజుతో తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తే మన సంస్కృతి, సంప్రదాయాలు, మూలాలను మనమే దూరం చేసుకున్నవారమవుతామని హెచ్చరించారు. ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు, తెలుగు భాషపై క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ.. తెలుగు భాష అంటే కేవలం మాట్లాడుకునే మాటలు కాదని.. మన జీవన విధానం, మన సంస్కృతి, మన చరిత్ర, మన ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. తేనెలొలికే తెలుగు పదాలు మనసులను కదిలించే శక్తిని కలిగి ఉన్నాయని, కఠిన హృదయాలను సైతం కరిగించే మాధుర్యం తెలుగు భాష సొంతమని పేర్కొన్నారు. “ఇతర భాషలు నేర్చుకోండి.. కానీ తెలుగు మాత్రం మర్చిపోవద్దు” అని నేటి తరం యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచంతో పోటీ పడాలంటే ఆంగ్లంతో పాటు ఇతర భాషలను నేర్చుకోవాల్సిందేనని, అయితే అందుకోసం మాతృభాషను తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పిల్లలకు చిన్ననాటి నుంచే మాతృభాషపై మమకారం పెంచాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కోరారు. ఇంట్లో పిల్లలతో తెలుగులో మాట్లాడటం, తెలుగు కథలు చెప్పడం, పద్యాలు చదివించడం, తెలుగు పుస్తకాలు చదివించే అలవాటు చేయడం ద్వారా భాషపై ప్రేమను పెంచవచ్చన్నారు. మాతృభాషలో విద్యాబోధన చేస్తే పిల్లలకు విషయాన్ని లోతుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని, వారి ఆలోచనా శక్తి, సృజనాత్మకత మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. బలమైన మాతృభాషా పునాది ఉన్న పిల్లలు ఇతర భాషలను కూడా సులభంగా నేర్చుకోగలరని చెప్పారు. తెలుగు భాషను కాపాడే బాధ్యత కేవలం ప్రభుత్వానిదో, ఉపాధ్యాయులదో కాదని.. ప్రతి తెలుగు బిడ్డ బాధ్యత అని అన్నారు. “తెలుగు మాట్లాడటం మన గౌరవం.. తెలుగు చదవడం మన సంస్కారం.. తెలుగు భాషను భావితరాలకు అందించడం మన బాధ్యత” అని ఈర్ల సమ్మయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అమృత, సురేష్ కుమార్, మంద శ్రీ వాణి, విద్యార్థినీ, విద్యార్థులు, పలువురు పాల్గొన్నారు.

## కోదాడలో ప్రజాస్వామ్యమా.. పోలీసు రాజ్యమా?

- పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని కక్ష సాధింపులు.. అక్రమ కేసులు
- 30 ఏళ్లుగా ఆధారమైన పాన్ డబ్బా తొలగింపు దారుణం
- ఉపేందర్ ను వాట్సాప్ మెసేజ్ ల పేరుతో అర్ధరాత్రి వరకు వేధించారంటూ ఆరోపణ
- బాధిత మహిళలపై పోలీసులు దాష్టీకంగా వ్యవహరించారన్న మాజీ ఎమ్మెల్యే
- పోలీసుల తీరుకు నిరసనగా సెప్టెంబర్ 2న స్టేషన్ ఎదుట మహాధర్నా
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతాం: బొల్లం మల్లయ్య యాదవ్



**ప్రజా వాయిస్,కోదాడ:** నియోజకవర్గంలో చట్టబద్ధమైన పాలన కనిపించడం లేదని, అమాయకులపై దౌర్జన్యాలు చేస్తూ పోలీసు రాజ్యం నడుపుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి బాధితురాలు గంధం కనకమ్మ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ మెసేజ్‌లు పెట్టారనే కారణంతో హైదరాబాద్‌లో ఉన్న ఉపేందర్‌ను కోదాడ పోలీసులు బలగాలతో తీసుకొచ్చి అర్ధరాత్రి వరకు విచారణ పేరుతో మానసికంగా వేధించారని ఆరోపించారు. న్యాయవాదులు, బీఆర్ఎస్ నాయకులు జోక్యం చేసుకునే వరకు నిర్బంధించారని మండిపడ్డారు. ఉపేందర్‌కు సోదరి అన్న కారణంతోనే కక్షగట్టి.. బొడ్రాయి సెంటర్‌లో 30 ఏళ్లుగా పాన్ డబ్బా నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఒంటరి మహిళ కనకమ్మ డబ్బాను తెల్లవారుజామున తొలగించారని అన్నారు.రాఖీ పండుగ సందర్భంగా న్యాయం కోసం నిరసన తెలిపిన మహిళలు, కుటుంబ సభ్యులపై పోలీసులు దాష్టీకంగా వ్యవహరించారని ఆరోపించారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పట్టణంలో గంజాయి దందాలు, అక్రమాలు పెరిగిపోయాయని ఆరోపించారు. పట్టుబడ్డ గంజాయి మాయం, బర్రెల దొంగల నుంచి లంచాల వసూళ్ల ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు.గతంలో తన ప్రెస్‌మీట్‌పై ఒక సీఐ అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన ఘటనపై డీజీపీ, ఎస్పీ, డీఐజీ, కలెక్టర్లకు ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఏడాదిన్నరగా చర్యలు లేవన్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్‌తో ఆరుగురు ప్రాణాలు కోల్పోయినా పట్టించుకోని పోలీసులు.. సామాన్యుల జీవనాధారాలను తొలగించడంలో మాత్రం అత్యుత్సాహం చూపుతున్నారని విమర్శించారు.

### ఆగస్టు 31న బంద్ కు పిలుపు

2న మహాధర్నాపోలీసుల ఏకపక్ష వైఖరి, అక్రమ కేసులకు నిరసనగా ఈనెల 31న సోమవారం కోదాడ పట్టణం బంద్ కు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2న కోదాడ పోలీస్ స్టేషన్ ఎదుట సహచర, ప్రజాస్వామిక పక్షాలతో కలిసి భారీ మహాధర్నా నిర్వహిస్తామని మల్లయ్య యాదవ్ ప్రకటించారు. బాధిత మహిళ కుటుంబానికి న్యాయం జరిగే వరకు చట్టపరమైన పోరాటంతో పాటు ప్రజాక్షేత్రంలోనూ పోరాడుతామని స్పష్టం చేశారు.



# అసత్య ఆరోపణలు చేస్తే సహించం

## మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిపై వ్యక్తిగత విమర్శలు తగవు

**ప్రజా వాయిస్,కోదాడ:**
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డిపై వ్యక్తిగత, అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని కోదాడ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శనివారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్థాయి మరచి సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.వ్యక్తిగతంగా పూజలు చేసుకుంటే సీఎం పదవి కోసం క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ ఆరోపించడం ఏమిటని ప్రశ్నించారు. తనకు ఓటు వేయలేదనే కారణంతో తోటి యాదవులపై విమర్శలు చేయడం అవివేకమన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మట్టి, ఇసుక దందాలు, అవినీతితో ప్రజలు విసిగిపోయి భారీ మెజార్టీతో ఓడించారని గుర్తుచేశారు. ఇకపై వ్యక్తిగత, అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

**సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు నిరసన కార్యక్రమాలు**
**ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఎక్కడ.?**
**కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలను ప్రజలకు వివరిస్తాం.**
**పాలకుర్తి నియోజకవర్గంలో గల్లీ గల్లీలో కాంగ్రెస్ హామీల వైఫల్యాలను ఎండగడదాం**
**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

**ప్రజా వాయిస్/దేవరుప్పుల (జనగాం జిల్లా))**
దేవరుప్పుల, ఆగస్టు 29కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో జరిగిన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు



బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు.
ఈ నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు దేవరుప్పుల మండల కేంద్రంలో మండల పార్టీ ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ప్రజలకు వివరించి, వాటి అమలు పరిస్థితిని ప్రతి గ్రామంలో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పాలకుర్తి నియోజకవర్గంలో గల్లీ గల్లీకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. గ్రామాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



# భక్తితో పూజించిన దేవతామూర్తుల ఫోటోలకు గౌరవప్రదమైన వీడ్కోలు

## గంధంగూడలో ప్రత్యేక సేకరణ కేంద్రం

## ప్రతి నెల మూడో శనివారం పాత పూజా సామగ్రి స్వీకరణ

**ప్రజా వాయిస్/రాజేంద్రనగర్:**భక్తిశ్రద్ధలతో పూజించిన దేవతా చిత్రాలు, చిన్న విగ్రహాలు,పూజా సామగ్రిని నిర్లక్ష్యంగా చెత్తలో పడేయకుండా గౌరవప్రదంగా స్వీకరించేందుకు గంధంగూడలో ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమైంది. రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ 123వ డివిజన్ పరిధిలోని పద్మావతి గోదా సమేత శ్రీ జ్ఞాన వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.పాత దేవతా చిత్రాలు,ఫొటోలు,ఫ్రేమ్ లు, చిన్న విగ్రహాలు,పూజా సామగ్రి తదితర పవిత్ర వస్తువులను ప్రతి నెల మూడో శనివారం ఆలయానికి తీసుకువస్తే జీహెచ్ఎంసీ సిబ్బంది స్వీకరించనున్నారు. తద్వారా పవిత్ర వస్తువులు రోడ్లపై,చెత్తకుప్పల్లో కనిపించకుండా వాటికి తగిన గౌరవం కల్పించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను కాపాడేందుకు అవకాశం ఏర్పడనుంది.ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన కార్యదర్శి గూడెం రాఘవులు,జీహెచ్ఎంసీ అధికారుల బృందంతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాతబడిన పూజా వస్తువులను పడేయడానికి బదులుగా ఆలయానికి తీసుకువచ్చి జీహెచ్ఎంసీ సిబ్బందికి అప్పగించాలని ప్రజలకు సూచించారు.123వ డివిజన్ ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని భక్తి విశ్వాసాలకు అనుగుణంగా పవిత్ర వస్తువులను గౌరవంగా అప్పగించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# పేపర్ కప్పులతో ఆరోగ్యానికి చేటు!

**ప్రజా వాయిస్ - మంచిర్యాల**
వేడి టీ, కాఫీని పేపర్ కప్పుల్లో తాగడం ఇప్పుడు సర్వసాధారణంగా మారింది. ప్లాస్టిక్ కప్పులతో పోలిస్తే పేపర్ కప్పులు సురక్షితమని చాలామంది భావిస్తున్నారు. అయితే పేపర్ కప్పుల లోపల ఉండే పలుచటి ప్లాస్టిక్ పొర కారణంగా వేడి పానీయాల్లోకి సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు చేరే అవకాశం ఉందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

**5 నిమిషాల్లోనే వేలాది కణాలు..**
వేడి నీటిని సుమారు 85-90 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద పేపర్ కప్పులో 5 నిమిషాల పాటు ఉంచిన పరిశోధనలో సుమారు 25 వేల మైక్రోప్లాస్టిక్ కణాలు ద్రవంలోకి విడుదలైనట్లు గుర్తించారు. కప్పు లోపలి ప్లాస్టిక్ లైనింగ్ వేడి ద్రవంతో సంబంధం కలిగినప్పుడు ఈ కణాలు విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది.

**కనిపించవు.. కానీ చేరుతాయి**
మైక్రోప్లాస్టిక్స్ కంటికి కనిపించనంత సూక్ష్మంగా ఉంటాయి. పేపర్ కప్పులపై జరిగిన పరిశోధనల్లో కొన్ని



లోహాలు, ఇతర పదార్థాలు కూడా వేడి ద్రవంలోకి చేరే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. అయితే పేపర్ కప్పులో టీ తాగడం వల్ల నేరుగా క్యాన్సర్ వస్తుందని నిర్ధారించే ఆధారం ఉందని చెప్పడం మాత్రం సరికాదు. మైక్రోప్లాస్టిక్స్ వల్ల కలిగే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావాలపై ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయి.

**రోజువారీ అలవాట్లపై దృష్టి అవసరం**
రోజుకు పలుమార్లు పేపర్ కప్పుల్లో వేడి టీ, కాఫీ తాగే వారు తమ అలవాటును ఒకసారి పరిశీలించుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా వేడి పానీయాన్ని ఎక్కువసేపు కప్పులో ఉంచకుండా ఉండటం, సాధ్యమైనంత వరకు పునర్వినియోగ కప్పులను ఉపయోగించడం మంచిది.

**స్టీల్, గాజు కప్పుల వినియోగమే మేలు**
వీలైనంత వరకు స్టీల్, గాజు లేదా సిరామిక్ కప్పులను ఉపయోగించడం ద్వారా డిస్పోజబుల్ కప్పులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు. ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు కూడా పునర్వినియోగ కప్పుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.టీ తాగడం ఆరోగ్యానికి హానికరం కాదు.. కానీ ఏ కప్పులో తాగుతున్నామన్నది కూడా ముఖ్యమే. సౌకర్యం కోసం ఉపయోగించే డిస్పోజబుల్ కప్పుల కంటే ఆరోగ్యకరమైన, పునర్వినియోగ కప్పులకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిదని ప్రజా జాగృతి అధ్యక్షులు రాజలింగు మోతె, వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఓరుగల్లు వేదికగా సెప్టెంబర్ 4న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

## రాంనగర్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు రథయాత్ర

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
ఓరుగల్లు నగరం శ్రీకృష్ణ నామస్మరణతో మారుమోగనుంది. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, మాజీ కూడా చైర్మన్, సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4న హనుమకొండలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గొల్ల, కురుమల సమక్షంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను సుందర్ రాజ్ యాదవ్ ఆవిష్కరించారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్ బీసీ భవన్ మీడియా సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో సంగం రెడ్డి సుందర్ రాజ్ మాట్లాడుతూ... ప్రతి ఏటా ఉమ్మడి వరంగల్ లోనే పెద్ద ఎత్తున హనుమకొండలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు.యాదవ వంశానికి చెందిన శ్రీకృష్ణ భగవానుని ఉత్సవాలు జరుపుకోవడం తమ అదృష్టమన్నారు . భగవద్గీత ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందని, శ్రీకృష్ణ తత్వాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.

రథయాత్రతో శ్రీకృష్ణ సందడి
సెప్టెంబర్ 4న మధ్యాహ్నం 2 గంటలకు రాంనగర్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు రథయాత్ర నిర్వహించనున్నారు. అనంతరం గోవుల పూజ, శ్రీకృష్ణ భగవానుని పూజ, తొట్లు ఊపే కార్యక్రమాలతో పాటు యాదవుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల ఆటాపాటలు నిర్వహించనున్నారు.

**పార్టీలకు అతీతంగా.. అందరికీ ఆహ్వానం**
శ్రీకృష్ణాష్టమి వేడుకలను పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నామని, అన్ని కులాలు, వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సుందర్ రాజ్ యాదవ్ కోరారు. వేడుకలకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జూబ్లీహిల్స్ నవీన్ యాదవ్, యాదగిరి యాదగిరిగుట్ట దేవస్థాన డైరెక్టర్, ఈశ్వరమ్మ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు,పెద్ద ఎత్తున కళాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు.కుటుంబ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు సమాజంలో భక్తిభావాన్ని పెంపొందించి, ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న యాదవులను ఏకం చేసి రాబోయే రోజుల్లో మరింత వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల చైర్మన్ షైన్ విద్యాసంస్థల చైర్మన్ యాదవ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మూగల కుమార్ యాదవ్, యాదవ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు ఎల్లావుల లలిత యాదవ్, జనగాం జిల్లా యాదవ సంఘము అధ్యక్షుడు రమేష్ యాదవ్, కాశబోయిన దూడయ్య యాదవ్, కిషోర్ యాదవ్, పెద్ద బోయిన నాగరాజు యాదవ్, సుర ప్రమోద్ యాదవ్,దాడి చిరంజీవి యాదవ్, సాయి యాదవ్,పెద్ద ఎత్తున యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు





# నిర్మల జ్యోతి సేవలు అభినందనీయం

## ఎంఈఓ శంకర్ రాథోడ్

**ప్రజా వాయిస్/రాజేంద్రనగర్:**
ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,హైదర్గూడా ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మల జ్యోతి విద్యారంగానికి అందించిన సేవలు అభినందనీయమని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు.శనివారం ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్‌లో నిర్మల జ్యోతి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శంకర్ రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..హైదర్గూడా ప్రాథమిక పాఠశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చేలా నిర్మల జ్యోతి చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఆమె సేవలను కొనియాడుతూ పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఉపాధ్యాయ బృందం, ఎంఈఓ ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు

## ఎన్పీడీసీఎల్ చర్యలు

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కొమరం భీం ఆసిఫాబాద్ సర్కిల్ పరిధిలోని 879 అంగన్వాడి కేంద్రాలకు తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందించింది. చిన్నారుల భవిష్యత్తుకు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే వివరించారు.విద్యుత్ సౌకర్యంతో అంగన్వాడి కేంద్రాల్లో ప్రీ-స్కూల్ కార్యకలాపాలు, ఆటలు, అభ్యసన కార్యక్రమాలు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి మోటార్లు వినియోగంలోకి రావడంతో చిన్నారులు వేడి, ఉక్కపోత ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకోగలుగుతున్నారని తెలియజేశారు. అంగన్వాడి కార్యకర్తలు పోషకాహారం తయారీ,



తాగునీటి సదుపాయం, పరిశుభ్రత, ఆరోగ్య సంబంధిత విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు.చిన్నారుల సంక్షేమం, విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ సర్కిల్ పరిధిలోని ప్రతి అంగన్వాడి కేంద్రానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఈ ఉత్తమ్ జాడే తెలిపారు.

# అకాల వర్షానికి కూలిన ఇల్లు.. రోడ్డునపడ్డ జర్నలిస్ట్ కుటుంబం..





**ప్రజావాయిస్, కోనరావుపేట/సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో అకాల వర్షానికి ఓ ఇల్లు కూలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లో నివసిస్తున్న కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఇల్లు పూర్తిగా దెబ్బతినడంతో కుటుంబం రోడ్డున పడింది.ప్రమాదానికి గురైన కుటుంబం ప్రజావాయిస్ వేములవాడ నియోజకవర్గ రిపోర్టర్ గొట్టె మనోహర్‌ది. అకాల వర్షం కారణంగా ఇల్లు కూలిపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ పరిస్థితిని అధికారులు పరిశీలించి, ప్రభుత్వం నుంచి తక్షణమే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.అలాగే తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి నిరాశ్రయులైన కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజావాణి..ఫిర్యాదులపై ఎందుకు మౌనం?

**దరఖాస్తులు స్వీకరించడమేనా..**
**పరిష్కారం అయ్యేది ఎప్పుడు?**
**రైతుల ప్రజల సమస్యలపై కదలని**
**అధికార యంత్రాంగం**
**ఐకేపీ కేంద్రాలపై ఫిర్యాదులకూ**
**దిక్కులేని పరిస్థితి!**
**భూ సమస్యల పరిష్కారానికి**
**కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు!.**
**రాజకీయ ఒత్తిళ్లా.. అధికారుల నిర్లక్ష్యమా?**
**పర్యవేక్షణ లేకుంటే ప్రజావాణి లక్ష్యం**
**నీరుగారే ప్రమాదం.!**
**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఫలితం**
**శూన్యం. అంటున్న ప్రజలు?**




**ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరో (ఆగస్టు 29)**
జనగామ ప్రజల సమస్యలను నేరుగా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం.. ప్రస్తుతం ఫిర్యాదులు స్వీకరించే కార్యక్రమం గానే మిగిలిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని వివిధ మండలాల నుంచి రైతులు, మహిళా సంఘాల సభ్యులు, సామాన్య ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ని ఆశ్రయిస్తున్నారు. అధికారులు ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపుతున్నా.. ఆ తర్వాత వాటిపై ఏం జరుగుతుందనే విషయం మాత్రం బాధితులకు అంతుచిక్కడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదు తీసుకున్నారు.. పరిష్కారం మాత్రం ఎప్పుడు?**
ప్రజావాణిలో దరఖాస్తు ఇవ్వగానే సంబంధిత అధికారులకు పంపుతున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితులు మళ్లీ అదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని అంటున్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తికి విచారణ ఎప్పుడు జరుగుతుంది? ఎవరు విచారణ చేస్తున్నారు? ఏం తేలింది? ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే సమాచారం అందకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.

**రైతుల గోడు వినేవారేరీ?**
ధాన్యం కొనుగోళ్లు, తూకాల్లో తేడాలు, ఐకేపీ కేంద్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై కొందరు రైతులు ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా.. వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ ఎందుకు జరగడం లేదని ప్రశ్నిస్తున్నారు. రైతు ఫిర్యాదు చేస్తే వెంటనే సంబంధిత అధికారులు ఐకేపీ కేంద్రానికి వెళ్లి రికార్డులు, తూకాల వివరాలు, కొనుగోలు ప్రక్రియను పరిశీలించి వాస్తవాలను తేల్చాల్సి ఉంటుంది. కానీ కొన్ని ఫిర్యాదుల విషయంలో ఇప్పటికీ స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**ఐకేపీ కేంద్రాలపై విచారణ ఎక్కడ?**
రైతులు నేరుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అంశాలపై సంబంధిత శాఖలు విచారణ చేపట్టాయా? చేపడితే ఎప్పుడు చేపట్టారు? ఏం తేలింది? బాధ్యులపై ఏమైనా చర్యలు తీసుకున్నారా? అనే ప్రశ్నలకు సమాధానాలు కావాల్సి ఉంది. ఫిర్యాదులు అందినప్పటికీ క్షేత్రస్థాయిలో విచారణ జరగకపోతే.. రైతులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

**భూ సమస్యలతో అవస్థలు**
భూముల రికార్డులు, హక్కులు, పట్టాలు, సర్వేలు, ఇతర రెవెన్యూ సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తున్నారు. అయితే పరిష్కారం కోసం మాత్రం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు. ఒకే సమస్యపై పలుమార్లు దరఖాస్తులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడితే ప్రజావాణి ఉద్దేశమే ప్రశ్నార్థకంగా మారుతుందని అంటున్నారు.

**రాజకీయ ఒత్తిళ్లా.. అధికారుల అలసత్వమా?**
కొన్ని ఫిర్యాదులపై అధికారులు వేగంగా స్పందిస్తుండగా.. మరికొన్ని ఫిర్యాదులపై ఎందుకు నత్తనడకన విచారణ సాగుతోందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకులు లేదా ఇతర ప్రభావశీల వ్యక్తుల ఒత్తిళ్లు ఉన్నాయా? లేక సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ఆరోపణలు వాస్తవమా కాదా అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

**పర్యవేక్షణ లేకుంటే ప్రజావాణి లక్ష్యం నీరుగారే ప్రమాదం**
ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు ఒక గడువు నిర్ణయించి, సంబంధిత శాఖల అధికారులు తీసుకున్న చర్యలను జిల్లా ఉన్నతాధికారులు సమీక్షించాల్సిన అవసరం ఉంది. పెండింగ్ ఫిర్యాదులపై మండలాల వారీగా ప్రత్యేక సమీక్ష నిర్వహించి.. ఫిర్యాదుదారుడికి విచారణ పురోగతిని తెలియజేయాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ప్రజల సమస్యలను నేరుగా వినే వేదికగా ఉన్న ప్రజావాణిపై కూడా ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి**
ప్రజావాణి అంటే కేవలం దరఖాస్తులు స్వీకరించడం కాదు.. వాటిపై విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే అసలు లక్ష్యం. జిల్లా ఉన్నతాధికారులు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి, ముఖ్యంగా రైతులు, మహిళా సంఘాలు, భూ సమస్యలతో బాధపడుతున్న ప్రజల ఫిర్యాదులపై సత్వర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సింగరేణి క్వార్టర్లలో షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు అరికట్టాలి

**- బాధిత క్వార్టర్‌కు తక్షణమే మరమ్మతులు ప్రారంభించిన యాజమాన్యానికి ధన్యవాదాలు**
**- సిఐటీయూ**

**ప్రజా వాయిస్ గోదావరిఖని**
ఆర్జీ-2 ఏరియా జీడీకే 8వ ఇంక్లైన్ కాలనీలోని ౨2-1255 క్వార్టర్‌లో శుక్రవారం రాత్రి 9:30 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఇంట్లోని ఫ్రిడ్జ్, గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు పూర్తిగా దగ్ధమై తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. అదృష్టవశాత్తూ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది.సమాచారం అందుకున్న వెంటనే సీఐటీయూ నాయకత్వం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. కాలనీలోని అనేక క్వార్టర్లలో సరైన ఎర్తింగ్ లేకపోవడం, రక్షణ వ్యవస్థలు అందుబాటులో లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలకు అవకాశం ఉందని నాయకులు పేర్కొన్నారు. కాలనీలోని అన్ని క్వార్టర్లలో ఎలక్ట్రికల్ వైరింగ్, ఎర్తింగ్, ట్రిప్పింగ్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, లోపాలను వెంటనే సరిచేయాలని సీఐటీయూ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది.

**యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు**
ప్రమాదం జరిగిన వెంటనే మైన్ రెస్క్యూ స్టేషన్‌కు సంబంధించిన బృందం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకోవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా అడ్డుకోగలిగారు.ఈ విషయాన్ని ఉదయమే సీఐటీయూ నాయకత్వం జనరల్ మేనేజర్, డీజీఎం (సివిల్/పర్సనల్) అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి, టెండర్ల పేరుతో ఆలస్యం చేయకుండా ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో అదే రోజున బాధిత క్వార్టర్ మరమ్మతు పనులను ప్రారంభించారు.కార్మిక కుటుంబ సమస్యపై తక్షణమే స్పందించి మరమ్మతులు ప్రారంభించిన జనరల్ మేనేజర్, డీజీఎం మరియు సంబంధిత సివిల్, ఎలక్ట్రికల్ అధికారులకు సీఐటీయూ,



కాలనీవాసుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచ్ సెక్రటరీ కుంట ప్రవీణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ సోమరాపు వెంకన్న, నాయకులు శివకుమార్, శ్రావణ్, సుమన్, మల్లేశం, నరేష్, తిరుపతితో పాటు స్థానిక కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# తడి చెత్త పొడి చెత్తలుగా వేరు చేసి ఎరువులు తయారు చేయాలి

**ప్రజా వాయిస్ మోత్కూరు (ఆగస్టు 29):**
డంపింగ్ యార్డును వెంటనే అభివృద్ధి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ అన్నారు. శనివారం పట్టణం లోని డంపింగ్ యార్డ్ ను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో కలిసి సందర్శించారు. పట్టణములో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ లో తడి పొడి చెత్తలుగా వేరు చేసి శాస్త్రీయ పద్ధతిలో ఎరువు తయారు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలోమునిసిపల్ కమీషనర్ గోల్కొండ నర్సయ్య,వైస్ చైర్ పర్సన్ పల్లెర్ల వెంకన్న కౌన్సిలర్లు కుర్మిల్లా ప్రమీల,సుల్తాన్ స్వామి, కొండా శోభ, మొగుళ్ళ అనురాధ, గనగని శైలజ, పన్నాల శ్రీ విద్య, బీసు

# ఆమర్‌గొండలో రీసర్వే పనులు పరిశీలించిన కలెక్టర్ హరిత



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం అమర్‌గొండ గ్రామంలో జరుగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ కే హరిత శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ భూముల గ్రౌండ్ ట్రూతింగ్ పనులు, గ్రామ పొలిమేర సరిహద్దులు, ఆవాస ప్రాంతాల సరిహద్దులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన భూములను తనిఖీ చేసి, సర్వే పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.సర్వేలో వినియోగిస్తున్న జీఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాలు, కంట్రోల్ పాయింట్ల పనితీరును పరిశీలించి, సాంకేతిక పరికరాల వినియోగం, ఖచ్చితత్వంపై సర్వే సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ మొత్తం విస్తీర్ణం, ప్రభుత్వ భూముల పరిమాణం, సర్వే నంబర్లు, రీ-సర్వేలో ఎదురవుతున్న సమస్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం స్థానిక రైతులు, గ్రామస్థులతో మాట్లాడి రీ-సర్వేపై వారి అభిప్రాయాలు, వినతులు, అభ్యంతరాలను స్వీకరించారు.రీ-సర్వేలో భూ సరిహద్దుల ఖచ్చిత నిర్ధారణ, రికార్డుల సమగ్ర పరిశీలన, రైతుల భాగస్వామ్యం కీలకమని కలెక్టర్ తెలిపారు. పొరపాట్లకు తావు లేకుండా, నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు వినయ్ కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రామేశ్వర్, మండల సర్వేయర్ ధన్‌రాజ్, రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**పేద విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం వద్దు:బీజేపీ నేతలు**



**ప్రజా వాయిస్/శంషాబాద్:**
రాష్ట్రంలో పేద విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజ్ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ..ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో సుమారు 40 లక్షల మంది పేద విద్యార్థులు,వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.పేద విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి,బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బాతుక్ శ్రీనివాస్ యాదవ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా వైద్యానికి కాంగ్రెస్ సర్కార్ కృషి

**మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్**

**ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వెంటిలేటర్ అంబులెన్స్ సేవలు ప్రారంభం..**

**ప్రజా వాయిస్ , మంచిర్యాల జిల్లా, లక్షెట్టిపేట /**
ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వెంటిలేటర్ అంబులెన్స్ సేవలను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను మెరుగైన వైద్యం అందించే ఆసుపత్రికి సురక్షితంగా తరలించేందుకు ఈ వెంటిలేటర్ అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పేద, సామాన్య ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ప్రజల ఆరోగ్య భద్రతకు మరింత భరోసా కల్పిస్తుందని తెలిపారు. అనంతరం హాస్పిటల్ ను సందర్శించి, వైద్యులతో మాట్లాడి పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ ఇన్స్టిట్యూట్ సీఈఓ రామచంద్రరావు, ప్రతిమ హాస్పిటల్ క్రిటికల్ కేర్ డాక్టర్ ప్రవీణ్, లక్షెట్టిపేట్ ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# క్రీడలు విద్యార్థినుల్లో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచుతాయి

**ధ్యాన్‌చంద్ జీవితం యువతకు ఆదర్శం**
**పీఈటీ స్వరూప.**
**విద్యార్థినుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు.**
**ప్రత్యేక అధికారి మడే అరుణ.**





**ప్రజా వాయిస్ ములుగు జిల్లా; ఏటూరునాగారం మండలం, ఆగస్టు 29:/**
ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి మడే అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు కలిసి మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడల ప్రాముఖ్యత, క్రమశిక్షణ, దేశభక్తి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు దేశభక్తి గీతాలు ఆలపించి, ప్రసంగాలు చేశారు.పీఈటీ స్వరూప మాట్లాడుతూ..... క్రీడలు విద్యార్థినుల్లో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ జీవితం యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక క్రీడలో పాల్గొనాలని సూచించారు. ప్రత్యేక అధికారి మడే అరుణ మాట్లాడుతూ..... తమ పాఠశాలలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థినుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతులు, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

## .పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే మురళి నాయక్

**ప్రజా వాయిస్ మహబూబాబాద్**
నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతులు, పెండింగ్‌లో ఉన్న పనులు, నూతన రహదారుల నిర్మాణం తదితర అంశాలపై మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ ఈఈ, ఆర్అండ్‌బీ ఈఈతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై నియోజకవర్గంలోని రహదారుల పరిస్థితిపై సమగ్రంగా చర్చించారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలు, మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగుపరచడంపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని



అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రహదారి నిర్మాణం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామాలకు కొత్త రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రపోజల్స్ (ప్రతిపాదనలు) సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. అవసరమైన చోట్ల హై లెవల్ బ్రిడ్జిలు (హెచ్ .ఎల్ . రోడ్స్ ) కల్వర్టులు, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు తెలిపారు. వర్షాకాలంలో రోడ్లు దెబ్బతినకుండా, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యం. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థితి లేకుండా అవసరమైన ప్రతి ప్రాంతానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి నిధులు తీసుకువస్తాం” అని ఎమ్మెల్యే మురళి నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ విఫల పాలనపై బిఆర్ఎస్ నిరసనలకు పిలుపు

- సెప్టెంబర్ 1 నుండి 8 వరకు వారం రోజుల కార్యాచరణ
- మాజీ ఎమ్మెల్యేకోరుకంటి చందర్



**ప్రజా వాయిస్ గోదావరిఖని**
?రామగుండం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హాజరయ్యారు. ?రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనను ఎండగడుతూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుండి 8 వరకు చేపట్టనున్న వారం రోజుల నిరసన ప్రణాళికను ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యం, యూరియా కొరత, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ సమస్యలు, మరియు ప్రజావాణి వినతుల వంటి పలు ప్రజా సమస్యలపై ప్రజల తరఫున పోరాడేందుకు ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టి అక్రమాలకు పాల్పడుతోందని కోరుకంటి చందర్ తీవ్రంగా ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ ఊరుకోదని, ప్రజాక్షేత్రంలో పెద్ద ఎత్తున నిరసనలు, పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.

# మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో తాత్కాలిక ప్రాతిపదికన గైనకాలజిస్ట్ భర్తీ

**అర్హులైన ఎంబీబీఎస్, ఎంఎస్ ఓబీ అండ్ జివై అభ్యర్థులు హాజరుకావాలని పిలుపు**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసిన వారికి ప్రత్యేక ప్రాధాన్యత: డీసీహెచ్‌ఎస్ డా. రాజశేఖర్ గౌడ్**

**ప్రజా వాయిస్ ఖమ్మం:**
తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని మధిర ఏరియా ఆసుపత్రిలో ప్రజలకు గైనకాలజీ వైద్య సేవలు అందించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన గైనకాలజీ స్పెషలిస్ట్ డాక్టర్‌ను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ప్రజల అత్యవసర వైద్య అవసరాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో చేపడుతున్న ఈ నియామకం కేవలం రెండు నెలల కాలానికి మాత్రమేనని, ఇది రెగ్యులర్, కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ భర్తీ కాదని ఆయన స్పష్టం చేశారు. ఎంపికైన వైద్యునికి నెలకు లక్ష రూపాయల గౌరవ వేతనం చెల్లిస్తారు. అభ్యర్థులు ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్ ఓబీ అండ్ జివై ఉత్తీర్ణులై ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రులు లేదా వైద్య సంస్థల్లో గైనకాలజీ విభాగంలో పనిచేసిన అనుభవం ఉన్నవారికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ పోస్టుకు సంబంధించిన వాక్-ఇన్-ఇంటర్వ్యూ సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లోని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం, మొదటి అంతస్తు, సూపరింటెండెంట్ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, అనుభవ ధ్రువపత్రాలు, రెండు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నిర్ణీత సమయానికి నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్ [https://khammam.telangana.gov.in](https://khammam.telangana.gov.in) ను సందర్శించాలని డీసీహెచ్‌ఎస్ పేర్కొన్నారు.



# ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు సూచనలు.. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువతకు పిలుపు



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామంలో ాױ= సవరణ ప్రక్రియపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ాױ= సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై గ్రామ ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములై, తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటు విలువను వివరించడంతో పాటు, ఓటు సవరణకు సంబంధించిన సమస్యలు ఉన్న వారికి బి.ఎల్.ఓ ల ద్వారా నోటీసులు అందించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా, గ్రామసభలో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిట్టా కిషన్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం మరియు సామాజిక అవగాహన కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ పేర్కొన్నారు.

# విద్యార్థులకు అధ్యయన సామగ్రి పంపిణీ

**ప్రజా వాయిస్ వేములపల్లి**
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల సమావేశంలో ఆరో తరగతి విద్యార్థులకు నల్లగొండ జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రూపొందించిన అధ్యయన సామగ్రిని ప్రధానోపాధ్యాయులు రమేష్ ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికితీసి, వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక రకాల విద్యాపరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, వాటిని ప్రతి



ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన కార్యక్రమాలు, ఉన్నత పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు విద్యార్థుల చదువుకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి నల్లగొండ జిల్లా సాంఘిక శాస్త్ర వేదిక చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా సాంఘిక శాస్త్ర వేదిక అధ్యక్షుడు నల్లమేకల వెంకయ్య, విభాగం అధ్యక్షుడు రహీం, వనరుల వ్యక్తులు అమరేందర్‌రెడ్డి, పొంగాల ప్రభాకర్‌రెడ్డి, జనార్దన్, కొల నాగయ్య, నరసింహ నాయక్, కురువ నాయక్, సైదా నాయక్, అంబటి వీరనారాయణ, సురేష్, సైదులు, శ్రీలత, సునీత, సుకన్య, కలమ్మ, వాణి తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ వరదల్లో చిక్కుకున్న వీపనగండ్ల గ్రామవాసి

## - ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానస సరోవరం వెళ్ళిన మహిళ




**ప్రజా వాయిస్.. వనపర్తి**
వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన పుట్ట శ్వేత ఇటీవల నేపాల్ వరదల్లో చిక్కుకున్నట్లు సమాచారం. స్థానికుల వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సురేష్ రెడ్డితో వివాహం తర్వాత కుటుంబంతో కలిసి అమెరికాలో ఉద్యోగరీత్యా నివసిస్తున్నారు. ఇటీవల మానస సరోవరంలో ఈశా ఫౌండేషన్,ఈశా ఏజెన్సీ ల సహకారంతో టిబెట్ మీదుగా మానస సరోవరం యాత్రకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నేపాల్ లో ఆకస్మికంగా సంభవించిన వరదల వలన కమ్యూనికేషన్ నెట్వర్క్ వ్యవస్థ దెబ్బ తినడంతో ఆమె నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుట్ట శ్వేత వివరాల కోసం సోదరుడు మధుసూదన్ రెడ్డి,పుట్ట శ్వేత భర్త సురేష్ రెడ్డి అమెరికా నుంచి కాట్మండుకు చేరుకుని వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఢిల్లీ హైదరాబాద్ సమాచార కేంద్రంలో సంప్రదించినప్పటికీ శ్వేత వివరాలు ఏమి తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుట్ట శ్వేత క్షేమంగా తిరిగి చేరుకోవాలని కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పత్తా లేని డాక్టర్లు... పరేషాన్ లో రోగులు

## తాళ్ళ గురజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు!

**ప్రజా వాయిస్ - బెల్లంపల్లి రూరల్**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లోని తాళ్ళగురిజాలగ్రామ పరిధిలో ఉన్న ఆయుష్మాన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని రోగులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులను ఇక్కడ ఉన్న ట్రైనింగ్ డాక్టర్లు మాత్రమే చూస్తున్నారని, పూర్తి స్థాయి వైద్యులు అందుబాటులో ఉండడం లేదని వారు వాపోతున్నారు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలను సైతం సరిగ్గా పరీక్షించి వైద్యం అందించడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. “ఫీవర్ వస్తుంది.. ఇంజెక్షన్ వేయండి” అని అడిగితే అవసరం లేదంటూ పంపిస్తున్నారు అని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా అందించాల్సిన మందులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని, “మేము ఇచ్చిన మందులే తీసుకోవాలి” అంటూ మాట్లాడుతున్నారని



రోగులు ఆరోపిస్తున్నారు. ఇక ఆసుపత్రి సిబ్బంది సమయపాలనపై కూడా రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోగులు వైద్యం కోసం ఎదురుచూస్తున్న సమయంలో సిబ్బంది భోజనానికి వెళ్లడం, రోగులను పట్టించుకోకపోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య కేంద్రాలే ప్రధాన ఆధారం కావడంతో అధికారులు ఈ ఆరోపణలపై వెంటనే స్పందించి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని తనిఖీ చేయాలని, పూర్తి స్థాయి వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల కొరత లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన గౌడ సంఘం నాయకులు

**ప్రజా వాయిస్/అడ్డగూడూరు:**
మండల పరిధిలోని అజీంపేట గ్రామానికి చెందిన పండుగ స్వామి ఇటీవల అనారోగ్యంతో మరణించగా శనివారం వారి కుటుంబ సభ్యులను గౌడ సంఘ నాయకులు పరామర్శించి రూ. 5,500 ఆర్థిక సహాయన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేష్, గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మధు గౌడ్, సంఘం నాయకులు సతీష్, వెంకన్న, చిన్న సోమన్న, నరేష్, బాలు, ప్రవీణ్, నవీన్, గణేష్ తదితరు పాల్గొన్నారు.





## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

**ప్రజా వాయిస్ - కన్నెపల్లి**

కన్నెపల్లి మండలం లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ అభియాన్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కన్నెపల్లి ఉన్నత పాఠశాలలో జిల్లా ఉపాధ్యక్షుడు మోకెనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తపస్ సంఘం లో చేరి జాతీయ భావ ప్రేరిత ఉపాధ్యాయ సంఘ నిర్మాణంలో ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలని కోరారు. 51% ఫిట్మెంట్ తో పి ఆర్ సి ని, పెండింగ్ లో ఉన్న 6 డి ఏ లు వెంటనే ప్రకటించాలని, సి పి ఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి శ్రీరాములు మండల అధ్యక్షులు గాజుల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి శశి కుమార్ పాల్గొన్నారు.

## మానవత్వానికి మారుపేరు విజయ్

**- ప్రమాదంలో కాలు కోల్పోయిన రాజేష్‌కు రూ.50 వేల ఆపన్నహస్తం**



**ప్రజా వాయిస్/మోమిన్‌పేట్:**

ఆపదలో ఉన్న వ్యక్తికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఇజ్రా చిట్టెంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ వందన భర్త విజయ్.అదే గ్రామానికి చెందిన రాజేష్ ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. రాజేష్ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న విజయ్ చలించిపోయి, తనవంతు సాయంగా రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.కష్టకాలంలో ఆర్థికంగా అండగా నిలవడమే కాకుండా, రాజేష్ కుటుంబానికి ధైర్యం చెప్పి "మీకు మేమున్నాం.. అధైర్యపడొద్దు" అంటూ భరోసా కల్పించారు. ప్రమాదం కారణంగా జీవితంలో ఎదురైన ఊహించని కష్టంతో బాధపడుతున్న రాజేష్‌కు విజయ్ అందించిన సహాయం ఎంతో ఊరటనిచ్చింది.ప్రజా ప్రతినిధులుగా సేవ చేయడమే కాకుండా, తమ గ్రామంలో ఆపదలో ఉన్న వారికి వ్యక్తిగతంగా అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. విజయ్ చూపిన ఔదార్యం, సేవా గుణం, మానవతా దృక్పథం పలువురికి ఆదర్శంగా నిలుస్తుందని వారు కొనియాడారు.డబ్బుతో చేసే సహాయం కంటే.. కష్టాల్లో ఉన్న మనిషికి ధైర్యం చెప్పి, అండగా నిలవడమే గొప్ప మానవత్వం అని విజయ్ మరోసారి నిరూపించారని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

## నీట్ (PG) పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 BNSS అమలు

**పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు,**

**పరిసరాలలో పోలీస్ పెట్రోలింగ్**

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,**

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**




ఆగస్టు 30 వ తేదిన వరంగల్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించే నీట్ (గ్రా+) -2026 పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 దీచీూా యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ శ్వేత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

## కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వం

**ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి**

**సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి**

**ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ**




**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి విమర్శించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే 1920 అక్టోబర్ 31న ఎఐటియుసి ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే 'వ్యాపారం సులభతరం' పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు, ఈ రాష్ట్ర మహాసభలను కార్మిక లోకం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు గుంటీ రాజేందర్, కర్రె బిక్షపతి, నాయకులు పూజారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అసోసియేషన్ ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్ చంద్ 121వ జయంతి వేడుకలు

**జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ర్యాలీ**

**ప్రజా వాయిస్ /దేవరకొండ**

దేవరకొండ పట్టణంలో స్థానిక జడ్.పి.హెచ్.ఎఎస్ నుండి ప్రారంభమైన ర్యాలీని సిఐ వెంకట్ రెడ్డి, అధ్యక్షుడు ఎన్ వి టి సభ్యులతో కలిసి క్రీడాజ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభించినారు. అనంతరం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనములో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి ఎస్ఐ రాజు, ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, ఎన్ వి టి సభ్యులతో కలిసి పూలమాలలు వేసి జోహార్లు అర్పించినారు. అనంతరం వారు మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ అద్భుతమైన బాల్ కంట్రోల్ కారణంగా హాకీ క్రీడాలో "ది విజార్డ్"అని పిలువబడ్డారు.ఆయన భారతదేశానికి 1928, 1932, 1936 ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించిపెట్టారు.భారత ప్రభుత్వం 1956 లో



ఆయనకు పద్మభూషణ్ అవార్డును అందజేసింది.మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు అతని పేరు మీద ఉందని అన్నారు అలాగే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడరాదని ప్రతి రోజు క్రీడా మైదానంలో క్రీడలు ఆడాలని చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని శారీరకంగా మానసికంగా ఎంతో ఉల్లాసంగా ఉంటారని కాబట్టి ప్రతి విద్యార్థి క్రీడలు అలవర్చుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు దేవరకొండలో ఇండోర్ అవుట్ డోర్ స్టేడియాలను ఏర్పాటు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్ ,కోశాధికారి కృష్ణ కిషోర్, భాస్కర్ రెడ్డి, లీగల్ అడ్వైజర్, ఉమా మహేష్ ,వైఎస్ కరుణాకర్, తాళ్ల సురేష్, ప్రసన్నకుమార్, జమీర్, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి భాస్కర్, రాజ్ కుమార్ రెడ్డి, రామకృష్ణ, సన్నీ, సాయి, అజయ్ చంద్ర, కానుగుల అంజి, యూనిస్, డాన్స్ మాస్టర్ నిఖిల, సాయి తేజ, పిఇటిలు రజిత,విజయలక్ష్మి, రవి, కేతవత్ రవి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, ఎస్ పి ఆర్ స్కూల్, రవీంద్ర భారతి స్కూల్, బచ్పన్ స్కూల్, బ్రిలియంట్ స్కూల్, జెడ్పిహెచ్ఎస్ స్కూల్, మరియు ఎన్ సీసీ విద్యార్థులు, గర్ల్స్ హై స్కూల్, మెటిల్డా స్కూల్, క్రీడాకారులు కళాకారులు అన్ని స్కూళ్ల సిబ్బంది యజమాన్యం విద్యార్థులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ప్రారంభమైన శ్రీ రాఘవేంద్ర స్వామి 355వ ఆరాధన మహోత్సవాలు

**శామీర్‌పేట / ప్రజా వాయిస్:** శ్రీ రాఘవేంద్ర స్వామి 355వ ఆరాధన మహోత్సవాలు శామీర్‌పేట మండల పరిధిలోని తూంకుంటలో ఉన్న శ్రీ గాయత్రి మహా క్షేత్రంలో శనివారం భక్తిశ్రద్ధలతో, కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ వ్యవస్థాపకులు, వాక్ బ్రహ్మ, శిష్యజనోద్ధారక డాక్టర్ ఎస్.వి.ఎల్.ఎన్. మూర్తి ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య ఆరాధన మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నిర్మాల్య విసర్జన, ప్రాణ ప్రతిష్ఠ, హోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణం, గోపూజ,



ధాన్యపూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ రాఘవేంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేద మంత్రోచ్చారణలు, భక్తి గీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రత్యేకంగా ప్రసాద వితరణ చేపట్టారు. అలాగే మధ్యాహ్నం భక్తుల కోసం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని రానున్న రోజుల్లో కూడా వివిధ ఆధ్యాత్మిక, పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

## దోమకొండ సింగిల్ విండో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**

**ప్రజా వాయిస్ దోమకొండ/**

కామారెడ్డి నియోజకవర్గంలోని దోమకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం క శనివారం చేపట్టారు.కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.నూతన సొసైటీ చైర్మన్‌గా చంద్రయ్యగారి అనంతరెడ్డి 12 మంది పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.రైతులకు అండగా రైతు సొసైటీలు పనిచేయాలని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడితేనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా సొసైటీలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సహకార సంఘాలు కేవలం రుణాల పంపిణీకి మాత్రమే పరిమితం కాకుండా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందించే కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.కామారెడ్డి నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, వ్యవసాయం తదితర రంగాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, కొంత ఆలస్యం జరిగినా ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.రైతులు చిన్నచిన్న అవసరాల కోసం అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామస్థాయిలోనే సహకార సంఘాల ద్వారా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, దోమకొండ సర్పంచ్ ఐరేని నరసయ్య , మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్ , మాజీ జెడ్పిటిసి తిరుమల గౌడ్, కామారెడ్డి కాంగ్రెస్ అధ్యక్షుడు ఇరేని సందీప్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వినీత్, గ్రామ అధ్యక్షులు సీతారాం మధు, గోపాల్ రెడ్డి, సంజీవ్, రామస్వామి గౌడ్, సిద్ధారెడ్డి, బాపురెడ్డి, బాలరాజ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



# అంతర్జాతీయ స్థాయిలో కీలక పదవి.. కొండగడప బిడ్డకు ఘన స్వాగతం

## ఖతార్‌కు భారత నూతన రాయబారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కొప్పుల శ్రీకర్‌రెడ్డి

**ప్రజావాయిస్, మోత్కూరు.**



ఖతార్‌కు భారత నూతన రాయబారిగా బాధ్యతలు చేపట్టిన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ కొండగడపకు చెందిన 2001 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ కొప్పుల శ్రీకర్‌రెడ్డి శనివారం తొలిసారిగా స్వగ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి అంతర్జాతీయ స్థాయిలో కీలకమైన పదవిని చేపట్టడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. చిన్న గ్రామం నుంచి విదేశీ వ్యవహారాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన శ్రీకర్‌రెడ్డి తమ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు. గ్రామానికి వచ్చిన ఆయనను పలువురు ప్రముఖులు, ప్రజలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.




# తాటి వనాల పెంపకానికి 5 ఎకరాల భూమి కేటాయించాలి

## గీతా పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్

**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం**

ప్రతి గీత కార్మికుల సొసైటీకి తాటి వనాల పెంపకం కోసం ప్రభుత్వం 5 ఎకరాల భూమిని కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర గీతా పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.గీత కార్మికుల జీవనోపాధికి తాటి, ఈత వనాలు ఎంతో కీలకమని, ప్రభుత్వం వీటి పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు 560 జీవో ప్రకారం కార్మికుల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరారు. అలాగే 51 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికుడు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. వెంకటేశ్వర్లు, సమన్వయ కార్యదర్శి నాగభూషణం, నాయకులు వీరమల్ల యాదయ్య, మొగుదాల సత్తయ్య, బి. యాదయ్య, బిక్షం, కిష్టయ్య, గోపి, పెంటయ్య, నారగోని స్వామి, పల్లె రాములు తదితరులు పాల్గొన్నారు.

# 92వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ఈనెల 30 నుండి ఆయుధ చండి అతి రుద్ర యాగం

## వనపర్తి జిల్లా కేంద్రంలోని హిందూ బంధువులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి

## శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి

**ప్రజా వాయిస్.. వనపర్తి**



ఈనెల 30 నుండి అక్టోబర్ 13 వరకు పెబ్బేరు రోడ్డు లోని పాల కేంద్రము ప్రక్కన పక్కన శ్రీకృష్ణ కాలచక్రం ఆధ్వర్యంలో 92వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు జరుగుచున్నవి. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఏర్పాట్లను పరిశీలించారు.కంసచాణూరమర్ధనమ్ దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ విష్ణుపంచాయతనం అయుత చండి “ అతిరుద్రం,శ్రీసీతారామ సామ్రాజ్య పట్టాభిషేకశీ చతుర్వేద పూర్వక మహాగణపతి, మహాసౌర, సుదర్శన, లక్ష్మీ నారాయణ సహిత శ్రీమద్భాగవత 92 వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవము శ్రీ కృష్ణ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి ఆధ్వర్యంలో జరుగుచున్న ఈ కార్యక్రమం మహోత్సవానికి హిందూ బంధువులు అందరూ వచ్చి పాల్గొని తరించాలని పిలుపునిచ్చారు కార్యక్రమం స్థలం వనపర్తి జిల్లా కేంద్రం మర్రి కుంట పాలకేంద్రం పక్కన ఈ కార్యక్రమానికి హాజరుకావాలని జర్నలిస్ట్ కానమోని ఆంజనేయులును కార్యనిర్వహకులు అయిన పీఠాధిపతి స్వామీజీ ఆహ్వాన పత్రికను అందజేశారు

# సర్వేల్ గురుకులం రూపురేఖలు మారుస్తాం: మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి

## మాతృ విద్యాలయానికి మాజీ డీజీపీ చేయూత



**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం**

తాను చదువుకున్న బడికి తిరిగి సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందని తెలంగాణ మాజీ డిజిపి మహేందర్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలను దత్తత తీసుకున్న ఆయన, శనివారం పాఠశాల ప్రాంగణంలో 5ఎస్ క్రమశిక్షణ, పరిశుభ్రత, అనవసర వస్తువుల తొలగింపు, పూర్వ విద్యార్థుల అనుసంధానం, అవగాహన మరియు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ డిజిపి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సర్వేల్ గురుకుల రూపురేఖలను సమూలంగా మార్చి, పూర్వ వైభవాన్ని తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ... సర్వేల్ గురుకులానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందనడానికి ఇక్కడ చదువుకుని ఉన్నత పదవులు అధిరోహించిన మహేందర్ రెడ్డి లాంటి పూర్వ విద్యార్థులే ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో గురుకులాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ టి. శ్రీనివాస్ రెడ్డి, ఏసీపీ గంగారామ్, డిఎస్పీ మధుసూదన్ రెడ్డి, సిఐ సతీష్ రెడ్డి, ఎస్సై పాండు, సర్వేల్ సర్పంచ్‌తో పాటు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా వాయిస్ ఎఫెక్ట్

**ప్రజా వాయిస్ కథనానికి అదిరిపోయే స్పందన..**

**కథనానికి స్పందించిన ప్రభుత్వం ఏరియా ఆసుపత్రి యంత్రాంగం..**

**ప్రజా వాయిస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన పేషంట్స్, రోగులు..**


ప్రజా వాయిస్

పచ్చదనంపై గొడ్డలి వేటు

- జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో ఘటన
- ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన చెట్లకు కత్తెర
- నరికివేతపై అధికారుల అనుమతులపై స్పష్టత కరవు
- నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నారా?
- పట్టించుకోని అధికారుల తీరుపై విమర్శలు



**ప్రజా వాయిస్ జహీరాబాద్:**

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన చెట్ల పచ్చదనంపై గొడ్డలి వేటు అనే వార్త శీర్షిక ప్రజా వాయిస్ లో ఒక్క కథనాన్ని ప్రచురించడం జరిగింది. వెంటనే స్పందించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి యంత్రాంగం ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసి కత్తిరించిన చెట్లను తొలగించడం జరిగింది. ప్రజా వాయిస్ ఛానల్, పత్రిక ప్రజా సమస్యల కథనాలతో, అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు వారధిగా నిలుస్తున్న ప్రజా వాయిస్ కు పేషెంట్లు , రోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

# మున్సిపల్ కౌన్సిల్లో 11 అంశాలు ఏకగ్రీవ తీర్మానం

**ప్రజా వాయిస్ ,మోత్కూరు,(ఆగష్టు29)**

మున్సిపల్ కేంద్రంలో ని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గడ్డం స్వప్న ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో 11 అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. కౌన్సిల్ సమావేశంలో అంగడిని అంగడి బజార్ కు మార్చడం, అంబేద్కర్ చౌరస్తా సమీపంలో ఆర్ అండ్ బి సహకార తో రోడ్ అభివృద్ధి చేయటం, మోత్కూర్ పట్టణంలో పట్టిన కోతులు పోనుమిగతా వాటిని కూడా పట్టుటకు, రానున్న పండుగులకు ఇబ్బందులు లేకుండా చేయుటకు, మరి కొన్ని నూతన విద్యుత్ బల్బులు కొనుకోలు చేయుటకు అలాగే కౌన్సిల్ లో ప్రవేశ పెట్టిన 11 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గోల్కొండ నర్సయ్య,వైస్ చైర్ పర్సన్ శ్రీ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు కుర్మిల్ల ప్రమీల, సుల్తాన్ స్వామి, కొండా శోభ, మొగుళ్ళ అనురాధ,గనగని శైలజ, పన్నాల శ్రీ విద్య, బీసు శ్రీకాంత్,నల్ల మధు,కారుపోతుల వెంకన్న, మెంట రమణ పాల్గొన్నారు.






# నేర నివారణలో నా వంతు బాధ్యత

**- మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్‌రెడ్డి**

**- సీసీ కెమెరాల రిపేర్‌కు రూ.2 లక్షల విరాళం**

**ప్రజావాయిస్/వికారాబాద్:**

పట్టణంలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రిపేర్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్‌రెడ్డి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. నేర నివారణలో తన వంతు బాధ్యతగా ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.పట్టణంలో సీసీ కెమెరాల వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సీసీ కెమెరాల రిపేర్, నిర్వహణ కోసం దాతలు ముందుకు వచ్చి పెద్ద మొత్తంలో సహాయం అందించాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందిస్తే వికారాబాద్‌ను నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని అర్థ సుధాకర్‌రెడ్డి అన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

## ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతం చేయాలి

## అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు

## ఎమ్మెల్యే తొలుకంటి ప్రకాష్ గౌడ్



**ప్రజా వాయిస్/రాజేంద్రనగర్**

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తొలికంటి ప్రకాష్ గౌడ్ సూచించారు.శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని లబ్ధిదారుల ఎంపిక,ఇళ్ల మంజూరు,నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అర్హులైన పేదలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టి,ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు.క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పథకం అమలులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.సమావేశంలో రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి సర్కిల్ డీసీ సురేందర్,అత్తాపూర్ సర్కిల్ డీసీ మల్లయ్య, నార్సింగి సర్కిల్ డీసీ లక్ష్మారెడ్డి,శంషాబాద్ సర్కిల్ డీసీ సుమన్‌రావు,హౌసింగ్ పీడీ చెంబె నాయక్ తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాషా, క్రీడా దినోత్సవ వేడుకలు



**ప్రజావాయిస్,మోత్కూరు,(ఆగస్టు 29):**

వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని శనివారం మోత్కూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ ,క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు ఉపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు మర్రి జయశ్రీ,క్రీడోపాధ్యాయుడు వెంకటరమణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్ బి.లలిత కుమారి డి.వెంకటయ్య ఎ.వెంకటాచారి జె.ప్రవీణ్ కుమార్ జి.రవి డి.స్వప్న జె. రవికుమార్ టి.ఉప్పలయ్య బి.నర్సయ్య ఆర్.ప్రణతి తదితరులు పాల్గొన్నారు.